ఈనాడు
కామారెడ్డి
గురువారం 24 ఆగస్టు 2017 16 పేజీలు

జలమార్గానికి సంపూర్ణ మద్దతు



కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనుల నిర్వహణకు బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో పర్యావరణ అనుమతుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. అన్ని వర్గాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. సమావేశంలో ఎమ్మెల్యేలు ఏనుగు రవీందర్‌రెడ్డి, హన్మంత్‌షిండే, జిల్లా పరిషత్ ఛైర్మన్ దఫేదార్‌రాజు, డీసీఎంఎస్ ఛైర్మన్ ముజీబొద్దీన్,పాలనాధికారి సత్యనారాయణ, సంయుక్త పాలనాధికారి సత్తయ్య, పర్యావరణ శాఖ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

– కామారెడ్డి

జీవం తీస్తున్నారు

మూగజీవాలు.. 200 కి.మీ. ప్రయాణం... తిండి లేక.. నీరు లేక.. దీంతో ఊపిరాడక మృత్యువాడ పడుతున్నాయి. అధికారులు లక్ష్యం కోసం పరితపిస్తున్నారు తప్పితే మూగజీవాల వేదనను పట్టించుకోవడం లేదు. ఫలితంగా లబ్ధిదారుల ఇంటికి చేరుకొనే లోపే మృత్యుఒడికి చేరుకొంటున్నాయి.

– న్యూస్‌టుడే, కామారెడ్డి, నస్రుల్లాబాద్



దుర్కిలో మృతి చెందిన గొర్రెలు

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయటం.. కులవృత్తులను ప్రోత్సహించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టింది. వీటిని గొల్ల, కురుమలకు రాయితీపై అందజేస్తోంది. లబ్ధిదారులకు అందజేసిన గొర్రెలతో పునరుత్పత్తి జరిగి జీవాల సంఖ్య పెరగటంతోపాటు, వాటిని విక్రయించుకొని లబ్ధిదారులు ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడటం పథకం ప్రధాన ఆశయం. స్థానికంగా ఉన్న జీవాలను కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందజేయాలి.

ఏం జరుగుతోంది

▲ కామారెడ్డి జిల్లాకు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో నాలుగు ప్రాంతాల నుంచి గొర్రెలను తీసుకురావాలి.

▲ కర్ణాటకలోని హుమ్నాబాద్, బీదర్, మహారాష్ట్రలోని పర్భణి, నాందేడ్ ప్రాంతాలకు పశు సంవర్ధకశాఖ అధికారులు, లబ్ధిదారులు బృందాలుగా వెళ్లి అక్కడ కొనుగోలు చేసి తీసుకురావాలి.

▲ ఆయా ప్రాంతాల్లో జీవాలు లభించటం కష్టంగా ఉంది. (మిగతా.. 7లో)

■ ఊపిరాడక మార్గమధ్యంలోనే మృత్యువాత

■ వాహనాల్లో స్థాయికి మించి తరలింపే కారణం

■ గంటల తరబడి నీరు, మేత కరవు

ఎందుకీ పరిస్థితి వచ్చిందంటే?

రవాణా విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం, గంటల తరబడి మేత, నీరు లేకపోవటం.. వాహనాల్లో కుక్కికుక్కి తీసుకొస్తున్న క్రమంలో ఊపిరాడక జీవాల ప్రాణంపోతోంది. ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చే క్రమంలో ఊపిరాడక అస్వస్థతకు గురై 20, రోడ్డు ప్రమాదంలో 12 జీవాలు మృతి చెందగా మరికొన్ని గాయాలు కావటం, అస్వస్థతకు గురికావటం వంటి ఘటనలు చోటు చేసుకొన్నాయి. సుదూర ప్రాంతాల నుంచి జీవాలను తరలిస్తున్న క్రమంలో తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తలు పాటించటం లేదని రవాణా సమయంలో చోటు చేసుకుంటున్న ఘటనలు తేటతెల్లం చేస్తున్నాయి.

జిల్లాకు మంజూరైన యూనిట్లు: 17,174
(మొదటి దశ: 8,640 రెండో దశ: 8,534)
మొదటి దశకు సంబంధించి ఇప్పటి వరకు పంపిణీ చేసిన యూనిట్లు: 2,828
యూనిట్ స్వరూపం: 21 గొర్రెలు
వ్యయం: ₹ 1,25,000
ప్రభుత్వ రాయితీ: ₹ 93,750
లబ్ధిదారుని వాటా: ₹ 31,250

4 జిల్లాల అనుబంధం



■ తెవివి పరిధిలోకి ఆదిలాబాద్, నిర్మల్

న్యూస్‌టుడే, తెవివి క్యాంపస్(డిచ్‌పల్లి)

తెలంగాణ విశ్వవిద్యాలయాని(తెవివి)కి కొత్త కళ రానుంది... దీని పరిధి నాలుగు జిల్లాలకు విస్తరించనుంది. ప్రస్తుతం నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలు విశ్వవిద్యాలయం పరిధిలో ఉండగా కొత్తగా నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలు రానున్నాయి. ఇందుకు సంబంధించి ఉన్నత విద్యా మండలి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.త్వరలోనే అధికారికంగా ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని విశ్వవిద్యాలయం అధికారులు అంటున్నారు.

తెలంగాణ విశ్వవిద్యాలయాన్ని 2006లో స్థాపించారు. 2011 జులై 19న ప్రభుత్వం 'అఫిలియేషన్ హోదా' ఇచ్చింది. నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాలను తెవివి విశ్వవిద్యాలయం పరిధిలోకి తీసుకు రావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. అయితే రాజకీయ ఎత్తుగడలో ఆదిలాబాద్, మెదక్ జిల్లాలు చే 'జారిపోయాయి'. స్వరాష్ట్రం ఏర్పాటు.. కొత్త జిల్లాల పునర్విభజన పుణ్యమాని మళ్లీ తెలంగాణ విశ్వవిద్యాలయానికి కొత్త కళ రాబోతోంది.

నాలుగు జిల్లాలతో కొత్త రూపు

● తెలంగాణ విశ్వవిద్యాలయంలోకి నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలు (మిగతా.. 7లో)

భోంచేస్తున్నారు

◆ కేంద్రం అక్షింతలు వేసినా మారని తీరు

◆ మధ్యాహ్న భోజనంపై పర్యవేక్షణ కరవు

◆ అధికారులకు వెళ్లని ఎస్‌ఎంఎస్

న్యూస్‌టుడే, నిజాంసాగర్

జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి 1257 వరకు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 147449 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. వీరిని నిత్యం సన్నబియ్యంతో పాటు వారానికి మూడు రోజుల పాటు కోడిగుడ్డుతో భోజనం అందించాలి. ఇందుకు ఒక్కో విద్యార్థికి నెలకు రూ.233 వరకు ఖర్చు చేస్తున్నారు. జిల్లాలో మధ్యాహ్న భోజనం కోసం నెలకు రూ.3.50 కోట్లు కేటాయిస్తున్నారు. దీంతో పాటు ఏజెన్సీలకు వేతనం కోసం (మిగతా.. 7లో)



నిజాంసాగర్ మండలం వెల్గనూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో ఈనెల 21న 31 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్న భోజనం పట్టికలో మాత్రం 58 మందికి బిల్లు చేశారు. ఉన్నతాధికారులకూ ఇదే సమాచారం ఇచ్చారు.

పీఎఫ్,ఈఎస్ఐ చెల్లిస్తాం



కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: బల్దియా కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ చెల్లింపుల్లో నిర్లక్ష్యంపై అధికారులు స్పందించారు. 'బల్దిదయ లేదు' శీర్షికన 'ఈనాడు'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం ఆర్డీవో, ఇన్‌ఛార్జి కమిషనర్ శ్రీను సమీక్షించారు.. త్వరలోనే కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ చెల్లిస్తామన్నారు. అకౌంటెంట్ లేక సమస్య ఎదురవుతోందన్నారు. కార్మికులకు సంబంధించి చెక్కులు అందుబాటులో ఉన్నాయన్నారు. బకాయిల చెల్లింపుల్లో జాప్యం లేకుండా చూస్తామని, కార్మికులు సంయమనం పాటించాలని కోరారు.

మెరుగుపడని రవాణా..!

● ఆర్టీసీ సేవలపై పెదవి విరుపు ● 8 నెలలుగా మారని తీరు ● దూరవాసులకు తప్పని ఇక్కట్లు

జిల్లాకేంద్రంగా మారిన నేపథ్యంలో రవాణా వసతులు మెరుగుపడాలి. కానీ, అడ్డంకులు తప్పడం లేదు. బాన్సువాడ, ఎల్లారెడ్డి మార్గాలకు గత నాలుగు నెలల కిందట ఎక్స్‌ప్రెస్ సేవలను ఆర్భాటంగా ప్రారంభించారు. గిట్టుబాటు కావడం లేదని అనతికాలంలోనే సేవలను నిలిపివేశారు. దీంతో అత్యవసర సమయాల్లో ఆర్టీసీ ప్రయాణాన్ని ఎంచుకున్న ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇక మంత్రి పోచారం పట్టుబట్టి జిల్లాకేంద్రం నుంచి బాన్సువాడకు ఎక్స్‌ప్రెస్ తిప్పాలని ఆదేశించడంతో ఒక బస్సును మాత్రమే కేటాయించారు. మిగతా జుక్కల్, మద్నూర్‌వాసులు జిల్లా కేంద్రానికి రావాలంటేనే జంకే పరిస్థితి నెలకొంది. గతంలో నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లడానికి అనువైన పరిస్థితి ఉండగా, ప్రస్తుతం కామారెడ్డికి రావడానికి ఆసక్తి చూపడం లేదు. ఇక అధిక బస్సులు నిజామాబాద్ నుంచి కామారెడ్డికి రాకుండానే రాజధానికి వెళుతున్నాయి. గతంలో అర్ధరాత్రి వరకు కళకళలాడిన కామారెడ్డి ప్రయాణ ప్రాంగణం ప్రస్తుతం రాత్రి 8 గంటల నుంచే వెలవెలబోతోంది.

- న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం


రాత్రి 8 గంటలకు బస్సులు లేక వెలవెలబోతున్న ఆర్టీసీ ప్రాంగణం


బస్సుకోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

జిల్లాల పునర్విభజన ఫలితంగా కామారెడ్డిలో జిల్లా పాలనాధికారి, ఎస్పీ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. దీంతో పాటు ఆయా శాఖల కార్యాలయాలు జిల్లాకేంద్రంలో తిష్ఠవేశాయి. ప్రస్తుతం జుక్కల్, మద్నూర్ వాసులు కామారెడ్డి రావడానికి 35 కి.మీ.లు అదనం అవుతోంది. ఎల్లారెడ్డి, బాన్సువాడ మార్గాల్లో ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపాల్సి ఉన్నా ఆ దిశగా ఆర్టీసీ చర్యలు చేపట్టడం లేదు. గత నాలుగు నెలల కిందట ప్రారంభించిన సేవలు అంతలోనే నిలిపివేశారు. కొత్తగా ఏర్పాటైన జిల్లాకేంద్రానికి ఎక్స్‌ప్రెస్, సర్వీసులు పెంచితేనే ప్రయోజనకరంగా ఉంటుంది. పాలన సౌలభ్యం కోసమే కొత్త జిల్లాలు ఏర్పాటవగా జిల్లా యంత్రాంగాన్ని ఆయా పనుల నిమిత్తం కలవడానికి వచ్చే వారికి చుక్కెదురవుతోంది. జిల్లా అధికార యంత్రాంగమంతా కామారెడ్డిలో ఉండి పరిపాలనను పర్యవేక్షిస్తోంది. బాన్సువాడ, ఎల్లారెడ్డి, జుక్కల్, మద్నూర్ ప్రాంతాలకు రవాణా సౌకర్యం ఉన్నా ఆర్టీసీ బస్సులను ప్రవేశపెట్టడంలో విఫలమవుతోంది.

35 శాతమే గిట్టుబాటు

ఇటీవల జిల్లాలో ప్రవేశపెట్టిన రెండు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 35 శాతం మాత్రమే ప్రయాణికులు వస్తున్నారని సేవలను నిలిపివేశారు. గత కొంత కాలంగా ఈ మార్గాల్లో పరిస్థితిని పరిశీలించి ఎట్టకేలకు ఈ నిర్ణయం తీసుకున్నామని అధికారులు చెబుతున్నారు. రద్దీ పెరిగి ప్రయాణికుల సంఖ్య పెరిగితే సేవలను పునరుద్ధరిస్తామని చెబుతున్నారు. మరోవైపు ప్రయాణికులేమో ఎక్స్‌ప్రెస్ బస్సులు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర మార్గాల్లో లాభాలు వచ్చినపుడు ఈ రెండు మార్గాల్లో తొలుత నష్టాలు వస్తే తప్పేమిటని చెబుతున్నారు. అధికారులు మాత్రం అందుకుససేమిరా అంటున్నారు. ప్రస్తుతం బాన్సువాడ మార్గంలో ఒకే ఎక్స్‌ప్రెస్ బస్సును నడుపుతున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

జిల్లాలో కామారెడ్డి, బాన్సువాడ డిపోలు ఉన్నాయి. ఈ డిపోల పరిధిలో 91 మార్గాల్లో నిత్యం ఆర్టీసీ సేవలందిస్తోంది. కామారెడ్డి డిపో పరిధిలో 49,462 కి.మీ, బాన్సువాడ పరిధిలో 39,692 కి.మీ.ల మేర సర్వీసులు తిరుగుతున్నాయి. కొత్త జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర రాజధానికి, పాత జిల్లాకేంద్రమైన నిజామాబాద్‌కు బస్సు సౌకర్యం బాగానే ఉంది. అయితే నిజామాబాద్ నుంచి కామారెడ్డికి రాత్రి 7.30 గంటలకు చివరి బస్సు ఉంది. ఆ తర్వాత రాజధానికి వెళ్లే బస్సులు వలయమార్గం(బైసాస్) మీదుగా వెళ్తుండటంతో ప్రయాణికులకు నరకయాతన తప్పడం లేదు. గతంలో కామారెడ్డి ప్రయాణ ప్రాంగణం రాత్రిపూట కళకళలాడేది. ఇపుడు బస్సులు లేక వెలవెలబోతోంది.

పొరుగు జిల్లాలకు ఎక్స్‌ప్రెస్‌లు కరవు

కామారెడ్డి జిల్లాకేంద్రం నుంచి పొరుగు జిల్లాలైన రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, మెదక్ తదితర జిల్లాలకు ఎక్స్‌ప్రెస్ బస్సులు లేవు. 3 ట్రిప్పులు మాత్రమే భద్రాచలం వెళ్లే ఎక్స్‌ప్రెస్ అందుబాటులో ఉంది. ఇక్కడి నుంచి ఆయా మార్గాల్లో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు లేక ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

రోడ్డు వసతి గగనం

కామారెడ్డి జిల్లాకేంద్రం నుంచి బాన్సువాడకు నేరుగా బస్సు సౌకర్యం ఉంది. ఇప్పటి వరకు సాధారణ బస్సులే తప్పా ఎక్స్‌ప్రెస్‌లు నడిపే దిశగా చర్యలు లేవు. ఆర్టీసీకి ఆదాయం గిట్టుబాటు కావడం లేదని గత రెండు మాసాల కిందట ప్రారంభించిన సేవలు నిలిచాయి. ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్, మద్నూర్ ప్రాంతాల్లో రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయి. ఏళ్ల తరబడిగా కొత్త రోడ్లు వేయడం, మరమ్మతులు చేపట్టడం వంటి చర్యలు గగనమయ్యాయి. ప్రస్తుతం జిల్లాకేంద్రం కావడంతో రవాణా వసతి కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పాలనాధికారి కేంద్రానికి చేరువలోనే..

జిల్లాకేంద్రంలో పాలనాధికారి కార్యాలయానికి చేరువలోనే ప్రయాణ ప్రాంగణ ఉంది. బాన్సువాడ, జుక్కల్, మద్నూర్ ప్రాంతాల నుంచి ఫిర్యాదులు చేయడానికి వచ్చే వారికి రవాణా వసతులు సక్రమంగా లేక ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్టీసీ అధికారులు బాన్సువాడ, జుక్కల్, ఎల్లారెడ్డి మార్గాల్లో సేవలను మెరుగుపరచాల్సిన అవసరముంది. నిజామాబాద్ నుంచి కామారెడ్డి మీదుగా ఇతర డిపోల ఎక్స్‌ప్రెస్ బస్సులు, ఇంద్ర, గరుడ బస్సులను తప్పాలి.

వివరాలివీ

బస్సులు	కామారెడ్డి డిపో	బాన్సువాడ డిపో
ఎక్స్‌ప్రెస్	20	41
పల్లె వెలుగు	71	68
అద్దె బస్సులు	32	13

రద్దీకి అనుగుణంగా సేవలు

- జనార్దన్, ఆర్టీసీ డీఎం



కామారెడ్డి జిల్లాకేంద్రం నుంచి బాన్సువాడ, ఎల్లారెడ్డి మార్గాల్లో గిట్టుబాటుకాక ఎక్స్‌ప్రెస్ సేవలను నిలిపివేశాం. ఇటీవల బాన్సువాడకు మాత్రమే ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరించాం. ఈ మార్గాల్లో రద్దీ పెరిగితేనే సేవలను పునరుద్ధరిస్తాం. ఆయా మార్గాలను పరిశీలించి ప్రైవేటు వాహనాలను కట్టడి చేస్తాం. నిజామాబాద్ నుంచి వచ్చే బస్సులు కామారెడ్డికి రాకుండానే వెళ్తున్నాయన్నది వాస్తవం. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం.

రౌడీషీటర్ల బైండోవర్

కామారెడ్డి, న్యూస్‌టుడే: గణేశ్ ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రానికి చెందిన రౌడీషీటర్లను బుధవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పట్టణ సీఐ శ్రీధర్‌కుమార్ తెలిపారు. పండగను దృష్టిలో ఉంచుకొని ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా బైండోవర్‌లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన కామారెడ్డి గ్రామీణ సీఐ

కామారెడ్డి, న్యూస్‌టుడే: కామారెడ్డి గ్రామీణ సీఐగా భిక్షపతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లో ఉన్న ఆయనకు ఇక్కడకి అటాచ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు.

టోల్‌ప్లాజా వద్ద పోలీసుల సోదాలు

పశువులు తరలిస్తున్న వాహనాలపై కేసులు నమోదు

భిక్కనూరు, న్యూస్‌టుడే: భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు బుధవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎస్సై రాంబాబు ఆధ్వర్యంలో పశువులు తరలిస్తున్న వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. పశువులు ఎక్కడి నుంచి కొనుగోలు చేశారో తెలుసుకున్నారు. వాటికి సంబంధించిన రశీదులను పరిశీలించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 8 వాహనాలను అదుపులోకి తీసుకున్న పోలీసులు రెండింటిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. అక్రమంగా పశువులను తరలిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు చేపట్టామన్నారు. అదుపులోకి తీసుకున్న వాహనాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న రెండింటిపై కేసులు నమోదు చేసి విచారిస్తున్నామన్నారు.


టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

రెడ్డిల సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం

కామారెడ్డి గ్రామీణం, న్యూస్‌టుడే: రెడ్డిల సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామని రెడ్డి ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ నాగర్తి చంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డిలో రెడ్డి ఐక్యవేదిక ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ... రెడ్డిలో పేదవారు చాలా మంది ఉన్నారన్నారు. ప్రభుత్వం వారిని గుర్తించి పథకాలు వారికి చేరేలా చూడాలని కోరారు. విద్యార్థుల కోసం నియోజకవర్గానికి ఒక రెడ్డి గురుకులం ఏర్పాటు చేయాలన్నారు. ఐక్యవేదికతో ద్వారా అందరిని ఏకతాటిపైకి తీసుకొస్తామన్నారు. అనంతరం గ్రామంలో రెడ్డికుటుంబాల సమగ్రసర్వే చేపట్టారు. సభ్యత్వాన్ని అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారంగుల అశోక్‌రెడ్డి, మండలాధ్యక్షుడు భీంరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ రెడ్డి, ప్రతినిధులు అంజిరెడ్డి, ప్రతాప్ రెడ్డి, నారాయణరెడ్డి, బాల్‌రెడ్డి, చంద్రారెడ్డి, రవీందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.


చిన్నమల్లారెడ్డిలో సభ్యత్వ పత్రం అందజేస్తున్న జిల్లా కన్వీనర్ నాగర్తి చంద్రారెడ్డి

ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల సౌకర్యార్థం సకాలంలో బస్సులు నడపాలని డిమాండు చేస్తూ బుధవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఉభయ జిల్లాల అధ్యక్షుడు ఆజాద్ మాట్లాడుతూ.. జిల్లాకేంద్రానికి రోజూ 20 వేల మంది విద్యార్థులు చదువుల నిమిత్తం ఆయా గ్రామాల నుంచి వస్తారన్నారు. సకాలంలో బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తన స్వార్థానికి రూ. 5 కోట్లతో ప్రత్యేక బస్సులు కొన్నారన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించి ముఖ్యమంత్రి జల్సాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. బస్సు పాసుల ఆన్‌లైన్ విధానం రద్దు చేయాలన్నారు. ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు ఇవ్వాలని డిమాండు చేశారు. ఈ ఆందోళనలో డివిజన్ అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి విఠల్, నాయకులు నరేందర్, నిమ్మ సురేష్, కుమార్, బాలాజీ, చెన్నప్ప, అఖిల్, శ్రావణ్, లావణ్య, మన్విత, మౌనిక, సౌమ్య, రజిత తదితరులు పాల్గొన్నారు.



డిపో ఎదుట ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

ఈనాడు సినిమాలు

ప్రియా 35 – ఫిదా
11:15, 2:15, 6:15, 9:10

ప్రియా 70 ఎంఎం – నేనే రాజు నేనే మంత్రి
11:15, 2:15, 6:15, 9:10

దర్శన్ – జయ జానకి నాయక
(11:15, 2:15, 6:15, 9:10)

శాంతి - లై
(11:15, 2:15, 6:15, రాత్రి 9:15)

- న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

బంగారం ధరలు

బంగారం 10 గ్రా (24 క్యారెట్స్) రూ. 30,100/-
వెండి (కిలో) రూ. 41,500/-

చికెన్ ధరలు

బర్డ్ లైవ్ : రూ.105 కిలో
విత్ స్కిన్ : రూ.141
స్కిన్‌లెస్ : రూ.176

- న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం



పింఛను విద్రోహదినం పత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

పింఛన్ విద్రోహ దినం పత్రాల ఆవిష్కరణ

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: సెప్టెంబరు 1ని పింఛను విద్రోహ దినంగా పాటించాలని కోరుతూ బుధవారం జిల్లాకేంద్రంలో తెలంగాణ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ... రాష్ట్రంలో 1.20 లక్షల మంది ఉపాధ్యాయ, ఉద్యోగ కుటుంబాల భద్రత అగమ్యగోచరంగా మారిందన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాతపింఛను విధానం అమలు చేయాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు పవన్, దేవువలా, రాజవర్ధన్, చంద్రశేఖర్, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భాజపా యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరేందర్‌రెడ్డి



కామారెడ్డి పట్టణం : భాజపా యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం జిల్లాశాఖ నియామక పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్టీ పటిష్ఠతకు తనవంతు కృషి చేస్తానన్నారు. యువతలో చైతన్యం కలిగిస్తానన్నారు. 2019లో భాజపాను అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తనకు పదవి అప్పగించిన జిల్లా అధ్యక్షుడు బాణాల లక్ష్మారెడ్డి, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు జూలూరి సుధాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నరకమైనా ఇష్టమే

- మౌలిక వసతులు కొరవడినా కాలం వెళ్లదీత
- పాతిక శాతం పట్టణాల్లోనే ...
- ఉభయ జిల్లాల్లో పరిస్థితి ఇదీ



పట్నవాసం బహుభారం.. తప్పని పన్నుల మోత.. ముక్కుమూసుకొని కాలం వెళ్లదీత.. గుక్కెడు నీటికి అపసోపాలు.. గడపదాటితే నడక గగనం.. ఇరుకు రోడ్లు.. ట్రాఫిక్ ఇక్కట్లు.. అద్దె ఇబ్బందులు.. ఇలా నగర జీవనం నరకప్రాయమే. అయినా పల్లెల నుంచి పట్నాలకు మకాం మారుస్తున్నారు. అవసరాన్ని ఆసరాగా మల్చుకొని సరికొత్త జీవనాన్ని ఆస్వాదిస్తున్నారు. గత పదేళ్లలో పట్టణాల్లో పల్లె జనాభా వృద్ధిరేటు పెరుగుతూ వస్తోంది. జిల్లా జనాభాలో మొత్తం పాతిక శాతం పట్టణాల్లోనే నివసిస్తున్నారు. నగర జీవనం గగనమైనా బతుకు బండి నెట్టుకొస్తున్నారు. ఆయా అవసరాల నిమిత్తం పల్లెలను వదిలి పట్టణాలకు వచ్చిన వారు కోకొల్లలు. వృత్తి, వ్యాపారం, ఉద్యోగం, చదువుల నిమిత్తం పట్టణాల్లో స్థిరపడిన వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. జిల్లాలో నెలకొన్న నగర జీవన గమనంపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

ఉభయ జిల్లాల్లో జనాభా గత పదేళ్ల కిందట 23.45 లక్షలు కాగా ప్రస్తుతం 25.52 లక్షలకు చేరింది. పదేళ్లలో 2.07 లక్షల జనాభా పెరిగింది. మొత్తం జనాభాలో 76.97 శాతం గ్రామీణ ప్రాంతంలో నివసిస్తుండగా 23.03 శాతం నగరం, పట్టణ ప్రాంతాల్లో ఉంటున్నారు. ఉమ్మడి జిల్లాలో 718 గ్రామ పంచాయతీలు, 1115 తండాల్లో 19,64,273 మంది, 1 కార్పొరేషన్, 3 మున్సిపాలిటీల్లో 5,87,800 జనాభా నివసిస్తోంది. జిల్లాలోని 6 ప్రధాన ప్రాంతాల్లో పరిస్థితిని పరిశీలిస్తే గతంలో కంటే ప్రస్తుతం జనాభా పెరిగింది. పల్లెల నుంచి ఆయా పనుల నిమిత్తం పట్టణాలకు రావడం.. దీంతో పరిధి విస్తరించడం చకచక జరిగిపోతోంది. భవిష్యత్తులో పల్లెల్లో సగం శాతం జనాభా మాత్రమే స్థానికంగా నివసించే అవకాశాలున్నాయని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పట్టణాల్లో పెరుగుతున్న జనాభా


పట్టణాల్లో పల్లెల నుంచి స్థిర పడిన వారితోనే జనాభా క్రమేపీ పెరుగుతూ వస్తుంది. ఉమ్మడి జిల్లాలో గతంలో మున్సిపాలిటీగా ఉన్న నిజామాబాద్ కార్పొరేషన్‌గా ఆవిర్భవించింది. జనాభా ప్రాతిపదికన నగర పాలకసంస్థగా ప్రాతినిధ్యం దక్కించుకుంది. ప్రస్తుతం 3.5 లక్షల పైచిలుకు జనాభా నిజామాబాద్ నగరంలో నివసిస్తోంది. ఇక ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీగా ఉన్న కామారెడ్డి దినదినాభివృద్ధి చెందుతోంది. రాజధానికి 110 కి.మీ దూరం ఉండడం, ఇక్కడ వాణిజ్య, వ్యాపార, విద్యా పరంగా సౌకర్యాలు ఉండడం, మూడు జిల్లాలకు కేంద్ర బిందువు కావడంతో ఆయా ప్రాంతాల నుంచి వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. పదేళ్ల కిందట 64 వేల జనాభా ఉండగా ప్రస్తుతం అధికారిక లెక్కల ప్రకారం 83 వేలకు చేరింది. అనధికారికంగా లక్షకు పైగా జనాభా నివసిస్తోంది. తాజాగా 6 గ్రామాల విలీనం జరిగితే లక్షకు పైగా జనాభా దాటితే ప్రథమ శ్రేణి మున్సిపాలిటీగా ఆవిర్భవించడం ఖాయమని చెబుతున్నారు. బోధన్ పట్టణంలో గతంలో 62 వేల జనాభా ఉండగా ప్రస్తుతం 77000, ఆర్మూర్‌లో గతంలో 48000 జనాభా ఉండగా ప్రస్తుతం 62000 మంది నివసిస్తున్నారు. ఇప్పుడిప్పుడే ఎల్లారెడ్డి, బాన్సువాడ పట్టణ స్థాయిగా ఆవిర్భవిస్తున్నాయి. ఎల్లారెడ్డి పట్టణంలో పదేళ్లకిందట 18 వేలు ఉండగా ప్రస్తుతం 25 వేలకు చేరింది. బాన్సువాడలో 28 వేల నుంచి 53 వేలకు చేరినట్లు గణాంకాలు చెబుతున్నాయి.



పెరిగిన వలసలు ఇలా..

నిజామాబాద్ కార్పొరేషన్‌తో కలుపుకుని 5 ప్రధాన ప్రాంతాల్లో జనాభా వృద్ధిరేటు గణనీయంగా పెరిగింది. పట్టణ ప్రాంతాల్లోనే పాతిక శాతం జనాభా నివసించడం పల్లె ప్రజల వలస జీవనానికి అద్దం పడుతోంది.





మెరుగుపడని సౌకర్యాలు

ఉభయ జిల్లాల్లో పట్టణ ప్రాంతాల పరిధి ఏటేటా విస్తరిస్తోంది. పరిధి పెరిగినా ప్రగతి గగనమవుతోంది. పన్నుల రూపేణా కార్పొరేషన్, బల్దియాలకు ఆదాయం సమకూరుతున్నా ప్రగతి ఛాయలు కనిపించడం లేదు. రోడ్లు సక్రమంగా లేక రాకపోకలు నరకప్రాయంగా మారుతున్నాయి. పక్కా డ్రైనేజీలు లేక కాలనీలు కంపుకొడుతున్నాయి. ఏటా రూ. 15 కోట్ల ఆస్తి పన్ను సమకూరుతున్నా కార్మికుల జీతభత్యాలు, సాధారణ కార్యకలాపాలకే పరిమితమవుతోంది. ప్రభుత్వం నుంచి సమకూరే నిధులతో ఆశించిన మేర ప్రగతి కనిపించడం లేదు. వృత్తి, ఉద్యోగం, వ్యాపారం, విద్య తదితర సౌకర్యాల నిమిత్తం పట్టణాలకు వచ్చి స్థిరపడ్డ వారు బహుభారాన్ని మోస్తు, సౌకర్యాల లేమితో సతమతమవుతున్నారు.

పిల్లల చదువుల నిమిత్తం వచ్చాం



మాది మాచారెడ్డి మండలం పాల్వంచ గ్రామం. పిల్లల చదువుల నిమిత్తం గత రెండేళ్ల నుంచి కామారెడ్డిలో నివసిస్తున్నాం. పల్లె ప్రాంతాన్ని కాదని పట్టణానికి వచ్చాం. ఇక్కడ వసతులు కరవైనా తప్పదు కదా. మంచి చదువుల కోసం ఇక్కడికి వచ్చాం. **- శ్రీనివాస్‌రెడ్డి, కామారెడ్డి**

ఉద్యోగ రీత్యా ఉంటున్నాం



మాది గాంధారి మండలం లింగంపల్లి. ఉన్నత చదువుల నిమిత్తం కామారెడ్డికి వచ్చి చాలా రోజులైంది. ప్రస్తుతం ఒక కళాశాలకి వైస్ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నా. వృతిరీత్యా నేను, నా భార్య పిల్లలు ఇక్కడే జీవిస్తున్నాం.
- దత్తాత్రి, లింగంపల్లి



మాట్లాడుతున్న పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్, ప్రతినిధులు

దాడికి పాల్పడింది తెలంగాణ ద్రోహులే

- పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు
- ఎస్పీపై చర్యకు డిమాండు

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: ఐకాస ఛైర్మన్ కోదండరాం తలపెట్టిన అమరుల స్ఫూర్తియాత్రను అడ్డుకుంది తెలంగాణ ద్రోహులేనని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ పేర్కొన్నారు. ఈ నెల 11న కామారెడ్డిలో జరిగిన దాడి విషయం తెలుసుకుని బుధవారం ఇక్కడకి వచ్చి వివరాలు సేకరించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్ఫూర్తియాత్ర సభను నిర్వహించడానికి విద్యార్థులు ఏర్పాటు చేసిన సభాస్థలిపై తెరాస నాయకులు విద్యార్థి సంఘాల నాయకులపై దాడులకు పాల్పడటం శోచనీయమన్నారు. ఈ ఘటన పోలీసుల సమక్షంలో జరిగినా వారు ప్రేక్షకపాత్ర వహించారన్నారు. కోడిగుడ్లు, కుర్చీలతో దాడి చేసిన సందర్భంలో అవి ఎస్సై, పోలీసు సిబ్బందికి సైతం తగిలాయన్నారు. ఈ విషయంలో పోలీసులు దాడికి పాల్పడినవారిపై కఠినమైన కేసులు పెట్టలేదన్నారు. శాంతిభద్రతలు అదుపుతప్పుతున్నాయని భావించినా మిన్నకుండిపోయారన్నారు. ఈ ఘటనలో చోద్యం చూసిన ఎస్పీ శ్వేతను సస్పెండ్ చేయాలని డిమాండు చేశారు. జిల్లాకేంద్రంలో ఇంత పెద్ద ఘటన జరిగినపుడు ఇతర అధికారులను అందుబాటులో ఎందుకు ఉంచలేదని ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్యానికి ఇది గొడ్డలిపెట్టన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చర్య తీసుకునేవరకు విశ్రమించేది లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రవీందర్, ప్రతినిధులు శ్రీనివాస్, మాలాద్రి, స్థానిక ఐకాస కన్వీనర్ జగన్నాథం, సహ కన్వీనర్ క్యాతం సిద్ధిరాములు, ప్రతినిధులు వేణుగోపాల్, కొత్తపల్లి మల్లయ్య, ఆయా విద్యార్థి సంఘాల నాయకులు భానుప్రసాద్, రవీందర్, సందీప్, సురేష్, విఠల్, లక్ష్మణ్‌యాదవ్, నరేష్, అరుణ్, సాయి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివంది సత్యం

బీడీ కార్మికుల ఇళ్లకు రూ. 5 లక్షలు మంజూరు చేయాలి

కామారెడ్డి గ్రామీణం, న్యూస్‌టుడే: బీడీ కార్మికుల ఇళ్లకు రూ. 5 లక్షలు మంజూరు చేయాలని నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంది సత్యం పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 8 లక్షల మంది బీడీ కార్మికులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వారికి సొంత ఇళ్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పీఎఫ్ నంబరు కలిగిన కార్మికులకు ఇళ్లు మంజూరు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయొద్దని కోరారు. ప్రభుత్వం ఇళ్లకు ఇచ్చే రూ. 1.50 లక్షలు సరిపోడం లేదన్నారు. షరతుల్లేకుండా జీవనభృతి ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ హసన్, సంజీవ్, బాలమణి, పద్మ, సునిత తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి

నేడు కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా మట్టి గణపతుల పంపిణీ

బీబీపేట(దోమకొండ), న్యూస్‌టుడే: బీబీపేట మండల కేంద్రంలో గురువారం ఛత్రపతి శివాజీ ఫౌండేషన్ ఆరో వార్షికోత్సవం సందర్భంగా మట్టి వినాయకుల పంపిణీ నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి పెరమాండ్లగౌడ్ తెలిపారు. పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సత్యనారాయణ, ఎస్పీ శ్వేత ముఖ్య అతిథులుగా వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో చమ్మక్‌చంద్ర, రాకింగ్ రాకేశ్, సీరియల్ నటి అంజలి వస్తున్నారన్నారు.

మూసి ఉన్న డీఆర్‌సీ కేంద్రం

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలో గోదాంరోడ్డులో ఏర్పాటుచేసిన చెత్త సేకరణ కొనుగోలు కేంద్రం గత వారం రోజులుగా మూసి ఉంటోంది. వార్డుల్లో చెత్తను సేకరించడానికి నిర్దేశించిన కేంద్రం ఆదిలోనే అభాసుపాలవుతోంది. కేంద్రం మూసి ఉంచడంతో వార్డుల్లో చెత్త పేరుకుపోతోంది. 3, 4, 5 వార్డులకు సంబంధించి స్థానికులకు సౌలభ్యంగా ఉండే కేంద్రం నిర్వహణ లోపభూయిష్టంగా మారింది.

పారిశుద్ధ్య నిర్వహణ విస్మరిస్తే చర్యలు

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య నిర్వహణ విస్మరిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుష్మ అన్నారు. జిల్లాకేంద్రంలో బుధవారం ఉదయమే పారిశుద్ధ్య పరిస్థితిని పర్యవేక్షించారు. ప్రధాన ప్రాంతాల్లో చెత్త తొలగకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లపై మురుగునీరు పారడంపై ప్రశ్నించారు. అపారిశుద్ధ్యాన్ని సహించేది లేదన్నారు. స్వచ్ఛ కామారెడ్డి దిశగా అడుగులు వేయాలని సూచించారు. వెంట పారిశుద్ధ్య బాధ్యుడు పర్వేజ్, సిబ్బంది ఉన్నారు.

భవనాలు శిథిలం...విద్యార్థులు పదిలమేనా?

☛ పెచ్చూలుడూతున్న పైకప్పులు ☛ నియోజకవర్గంలో ప్రభుత్వ బడులు అధ్వానం

ఇది కామారెడ్డి మండలం అడ్లూర్ ప్రాథమిక పాఠశాల. గత ఏడాది వర్షాలకు దెబ్బతిన్నది. మూడు రోజుల క్రితం పడిన వర్షాలకు స్లాబు పెచ్చులూడడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు. ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు భిక్కుభిక్కుమంటూ గడుపుతున్నారు.



- న్యూస్‌టుడే కామారెడ్డి గ్రామీణం

ప్రభుత్వ బడులు సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయి. శిథిల భవనాల్లో విద్యార్థులు భిక్కుభిక్కుమంటూ చదువుకుంటున్నారు. ఏళ్లనాటి భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరమ్మతులకు నిధులు కరవయ్యాయి. పాఠశాల భవనాలు పగుళ్లు, స్లాబులు పెచ్చులూడి అధ్వానంగా తయారయ్యాయి. ఎప్పుడు కూలుతాయోనని విద్యార్థులు భయపడుతున్నారు. చిన్నపాటి వర్షాలకే తరగతి గదులు ఊరుస్తున్నాయి. అసౌకర్యాల మధ్య విద్యార్థులు చదువు సాగిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు దృష్టిసారిస్తేనే ప్రయోజనం ఉంటుంది.

ప్రజాప్రతినిధుల పట్టింపేది?

ప్రభుత్వ పాఠశాల్లో విద్య మెరుగుపడుతున్నా వసతులు కరవయ్యాయి. ఏళ్ల తరబడి విద్యార్థులు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. ఉపాధ్యాయులు అరకొర సౌకర్యాల మధ్యే పాఠశాలలను నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ బడులకు పంపేందుకు ఆసక్తి చూపడం లేదు. ఏటేటా విద్యార్థుల ప్రవేశాలు తగ్గిపోవడానికి ప్రధాన కారణం వసతులు లేకపోవడమే. యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటించి శిథిలావస్థకు చేరిన పాఠశాలను గుర్తించి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పరిశీలన

ఏళ్ల నాటివి కావడంతో..

ఏళ్లనాటి భవనాలు కావడంతో తరగతుల్లో స్లాబులు అకస్మాత్తుగా పెచ్చులూడి విద్యార్థులు గాయాలపాలవుతున్నారు. చేసేదేమిలేక ఉపాధ్యాయులు చెట్లకింద తరగతులు నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతోంది. తరగతి గదుల్లో వర్షపు నీరు చేరుతోంది. కొన్ని చోట్ల పాములు వస్తున్నాయి.

నియోకవర్గంలో ఇదీ పరిస్థితి



అడ్లూర్ ప్రాథమిక పాఠశాలలో పెచ్చులూడిన తరగతి గది

ఈ చిత్రంలో చిన్నమల్లారెడ్డి ప్రాథమిక పాఠశాల వరండాల్లో స్లాబు పూర్తిగా లేచిపోయింది. వర్షానికి తరగతి గదిలో పెచ్చూలుడి పడ్డాయి. కనీస మరమ్మతులు కరవయ్యాయి. వర్షాకాలంలో విద్యార్థులు భయంభయంగా ఉంటున్నారు.



నియోజకవర్గంలో కామారెడ్డి, భిక్కనూరు, మాచారెడ్డి, దోమకొండ, బీబీపేట, రాజంపేట మండలాల్లో మొత్తం 56 ఉన్నత పాఠశాలలు, 26 ప్రాథమికోన్నత పాఠశాలలు, 165 ప్రాథమిక పాఠశాలలున్నాయి. 18,532 మంది విద్యార్థులు చదువుతున్నారు. కామారెడ్డి మండలం అడ్లూర్ ప్రాథమిక, తిమ్మక్‌పల్లి ప్రాథమిక, క్యాసంపల్లి ప్రాథమిక, జిల్లాకేంద్రంలోని బాలుర పాఠశాల, గొల్లవాడ ప్రాథమిక, శ్రీరాంనగర్‌కాలనీ ప్రాథమిక, హనుమాన్ మందిర ఉన్నత పాఠశాలలు శిథిలావస్థలో ఉన్నాయి. ఉమ్మడి భిక్కనూరు మండలంలో రాజంపేట, భిక్కనూరు బాలుర పాఠశాలలు, ఉమ్మడి దోమకొండ మండలంలో దోమకొండ బాలుర, మాందార్‌పూర్ ఉన్నత పాఠశాల, బీబీపేట బాలుర పాఠశాలల్లో తరగతి గదుల పైకప్పుడు అధ్వానంగా ఉన్నాయి. మాచారెడ్డి మండలంలో చుక్కాపూర్, భవానీపేట, రెడ్డిపేట, అన్నారం పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

ఇబ్బందులు పడుతున్నాం



- తేజశ్రీ, విద్యార్థిని, చిన్నమల్లారెడ్డి

పాఠశాలకు వెళ్లాలంటే భయమేస్తోంది. మా తరగతి గదిలో వర్షానికి స్లాబు పెచ్చులూడింది. ఆ సమయంలో మేం ఎవరం గదిలోకి వెళ్లలేదు. వర్షానికి తరగతి గదిలో నీరు నిలిచింది. చిన్న పిల్లలం ఇబ్బందులు పడుతున్నాం.

తీర్మానం చేసి ఇస్తే ఉన్నతధికారులకు నివేదిస్తాం



- ఎల్లయ్య, ఎంఈవో, కామారెడ్డి

శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. ప్రజాప్రతినిధులు, ప్రధానోపాధ్యాయుడు తీర్మానం చేసి ఇస్తే నిధుల కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

పెద్దమల్లారెడ్డి(భిక్కనూరు), న్యూస్‌టుడే: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన 9 మంది లబ్ధిదారులకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ బుధవారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడపడుచుల వివాహానికి అండగా నిలువడానికి ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం ద్వారా రూ. 75 వేలు పంపిణీ చేస్తుందన్నారు. అనంతరం పెద్దమల్లారెడ్డికి చెందిన ఆరుగురు, అయ్యవారుపల్లికి చెందిన ఇద్దరు, మల్లుపల్లికి చెందిన ఒకరికి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి భూమయ్య, తెరాస మండల ప్రధానకార్యదర్శి బాలగోని రాజాగౌడ్, సాయాగౌడ్, దేవయ్య, సిద్ధిరాములు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలి



మాట్లాడుతున్న భాజపా మండలాధ్యక్షుడు నర్సింలు

బీబీపేట(దోమకొండ),న్యూస్‌టుడే: బీబీపేట మండలంలో పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని భాజపా మండలాధ్యక్షుడు దుంపల నర్సింలు పేర్కొన్నారు. బుధవారం బీబీపేట మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో బూత్‌లెవల్ సమావేశం నిర్వహించాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అంజాగౌడ్, బీజేవైఎం మండలాధ్యక్షుడు రంజిత్‌గౌడ్, నాయకులు వంశి, దేవరాజ్‌గౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతికి పాదయాత్ర

భిక్కనూరు, న్యూస్‌టుడే: మహారాష్ట్ర నుంచి తిరుపతికి పాదయాత్ర ద్వారా వెళ్తున్న దంపతులు బుధవారం భిక్కనూరు మండలం జంగంపల్లికి చేరుకున్నారు. నాండేడ్‌కు చెందిన సుభాష్-నర్మదలు 20 రోజుల క్రితం నాండేడ్ నుంచి తిరుపతికి పాదయాత్ర చేపట్టారు. నిత్యం 20 కి.మీ.లు నడక సాగిస్తున్నట్లు తెలిపారు.

సామూహిక సెలవుకు వినతి

ఘన్‌పూర్(ఎం), మాచారెడ్డి, న్యూస్‌టుడే: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ.. మాచారెడ్డి మండలం ఘన్‌పూర్(ఎం) యూపీఎస్ ఉపాధ్యాయులు బుధవారం సామూహిక సెలవు పత్రాన్ని అందజేశారు. సీపీఎస్ విధానం అమల్లోకి వచ్చిన సెప్టెంబరు 1న సామూహికంగా సెలవు పెట్టి నిరసన తెలిపేందుకు ఉపాధ్యాయులం సిద్ధమవుతున్నామన్నారు.

రాజంపేట(భిక్కనూరు): సీపీఎస్ విధానం రద్దుకోసం వచ్చేనెల 1న పీఆర్టీయూ ఉపాధ్యాయులంతా సామూహిక సెలవులో వెళ్తున్నట్లు సంఘం నాయకులు ఎంఈవో భూపాల్‌రెడ్డికి బుధవారం విన్నవించారు. సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు నర్సారెడ్డి, అశోక్, నాయకులు ఆశిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సుధారాణి, మహేశ్‌కుమార్, విజయవర్ధన్, గిరి తదితరులు పాల్గొన్నారు.

కాచాపూర్(భిక్కనూరు): సీపీఎస్ రద్దు కోసం సెప్టెంబర్ 1న సామూహిక సెలవు పెడుతున్నట్లు మండలంలోని కాచాపూర్ గ్రామ ఉపాధ్యాయులు ఇన్‌ఛార్జి హెచ్‌ఎం చంద్రలీలకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు శ్రీనివాసాచారి, గంగమణి, శ్రీనివాస్, రామకృష్ణ, శ్రీధర్, శ్రీనివాస్, సతీష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీబీపేట(దోమకొండ): సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా సెప్టెంబరు 1న సామూహిక సెలవు పెడుతున్నట్లు బీబీపేట మండల సీపీఎస్ ఉపాధ్యాయులు బుధవారం ఎంఈవో సంజీవరెడ్డికి వినతి పత్రం అందజేశారు. సీపీఎస్ ఉపాధ్యాయులు ఆర్.శేఖర్, రవీందర్‌రెడ్డి, బాలకిషన్, రామరాజు, రాజు, సత్యం, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.



బీబీపేట ఎంఈవో సంజీవరెడ్డికి వినతి ఇస్తున్న ఉపాధ్యాయులు



రాజంపేట ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న పీఆర్టీయూ ప్రతినిధులు

కామారెడ్డి

మరుగుదొడ్డి నిర్మించుకోవాలని ప్రచారం

అంబారిపేట(దోమకొండ), న్యూస్‌టుడే: దోమకొండ మండలం అంబారిపేటలో బుధవారం ఐకేపీ, అంగన్‌వాడీ, గ్రామ స్థాయి అధికారులు మరుగుదొడ్ల నిర్మాణంపై అవగాహన కల్పించారు. మరుగుదొడ్డి లేని వారికి బొట్టు పెట్టి ప్రచారం నిర్వహించారు. మరుగుదొడ్డి నిర్మాణంతో కలిగే లాభాలను వివరించారు. ప్రతి ఇంటా మరుగుదొడ్డితో వంద శాతం స్వచ్ఛత సాధించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి కుంట గంగవ్వ, ఐకేపీ సీసీలు, వీవోఏలు, గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.


మరుగుదొడ్లు నిర్మించుకోవాలని బొట్టు పెడుతున్న ఐకేపీ వీవోఏలు

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

భిక్కనూరు, న్యూస్‌టుడే: మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో గోపాల్‌రావు బుధవారం తనిఖీ చేశారు. రిజిస్టర్‌లో 12 మంది చిన్నారులకు హాజరు వేసి ఉండగా కేంద్రంలో ఆరుగురు విద్యార్థులే ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడ్లు చిన్న పరిమాణంలో ఎందుకు ఉంటున్నాయని ప్రశ్నించారు. పీడీకి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

జోరుగా మట్టి గణపతుల పంపిణీ

భిక్కనూరు, న్యూస్‌టుడే: మండలకేంద్రంలోని ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో బుధవారం మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. పర్యావరణం పరిరక్షించడానికి ప్రతిఒక్కరు మట్టి విగ్రహాలనే పూజించాలన్నారు. కార్యక్రమంలో ఆర్య వైశ్యప్రతినిధులు నాగరాజు, మధుసూధన్, సిద్దగిరి, శేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట(భిక్కనూరు): మండలంలోని రాజంపేటలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో బుధవారం మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. రసాయనాలతో విగ్రహాల వల్ల పర్యావరణం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు ముత్యపు సిద్ధిరాములు, మండలశాఖ అధ్యక్షుడు రమేశ్, ప్రతినిధులు మొలుగు చంద్రమౌళి, ముత్యపు రాజు, బచ్చు శ్రీనివాస్, నాగెల్లి వీరేశం, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: భిక్కనూరు, రాజంపేట మండలాల్లోని ఆయా పాఠశాలల విద్యార్థులు బుధవారం మట్టి వినాయక విగ్రహాలు తయారు చేశారు. రాజంపేట బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు మట్టిప్రతిమలు తయారు చేసి పంపిణీ చేశారు. కాచాపూర్ ఉన్నతపాఠశాలల విద్యార్థులు మట్టితో విగ్రహాలు తయారు చేసి ఇతర విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కామారెడ్డి పట్టణం: జిల్లాకేంద్రంలో బుధవారం ఆర్య వైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తృప్తి అనిల్, ప్రతినిధులు సంతోష్, రమణ, రమేష్, వాసు, సుదర్శన్, నాగరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి పట్టణం: జిల్లాకేంద్రంలోని అశోక్‌నగర్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. విశ్వనాథుల మహేష్‌గుప్తా సౌజన్యంతో కార్యక్రమం జరిగింది. కాలనీవాసులకు 300 మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి నిమ్మ దామోదర్‌రెడ్డి, కోశాధికారి గంగాధర్, ప్రతినిధులు రఘు, శ్యాంగోపాల్, పంపరి శ్రీనివాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


కామారెడ్డిలో మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న ప్రతినిధులు


రాజంపేటలో మట్టివిగ్రహాలు పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్యులు


కాచాపూర్‌లో...

రక్షిత నీటినే తాగాలి


అవగాహన కల్పిస్తున్న సాకీవాటర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వినాయక్

అడ్లూర్(కామారెడ్డి గ్రామీణం),న్యూస్‌టుడే: విద్యార్థులు శుద్ధి చేసిన నీటిని తాగాలని సాకీవాటర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వినాయక్ పేర్కొన్నారు. బుధవారం కామారెడ్డి మండలం అడ్లూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తాగునీరు, పచ్చదనంపై అవగాహన కల్పించారు. కలుషిత నీటితో ఎన్నో రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పాఠశాలల్లో క్రమం తప్పకుండ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలాగౌడ్, చంద్రునాయక్, ఉపాధ్యాయులు కృష్ణ, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

భూ రికార్డుల పరిశీలన


భూ రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దారు సాయిభుజంగరావు

చింతామాన్‌పల్లి, సంగమేశ్వర్(దోమకొండ), న్యూస్‌టుడే: దోమకొండ మండలంలోని సంగమేశ్వర్, చింతామాన్‌పల్లిలో బుధవారం భూ రికార్డులను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. తహసీల్దారు సాయిభుజంగరావు, ఆర్ఐ రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో రెండు గ్రామాల్లో భూమి రికార్డుల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌వోఆర్, పహాణీ, ఆన్‌లైన్ పహాణి పుస్తకాలను పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్వోలు రమేశ్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

84వ రోజుకు రిలే దీక్షలు


రిలే దీక్షలో కూర్చున్న ఐకేపీ వీవోఏలు, డ్వాక్రా మహిళలు

దోమకొండ, న్యూస్‌టుడే: దోమకొండలో డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని కోరుతూ డిగ్రీ కళాశాల సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలేదీక్షలు బుధవారం నాటికి 84వ రోజుకు చేరాయి. రిలే దీక్షలో గ్రామ సంఘాల ప్రతినిధులు కమ్మరి లావణ్య, జోన్నల నీలవేణి, ముద్దసాని కవిత, పెద్ది జ్యోతి, కుమ్మరి రాజమణి, నాగుల లక్ష్మి, నాగారాపు లక్ష్మి, ముద్దసాని మంజుల కూర్చున్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు తిర్మల్‌గౌడ్, ఐరేని నర్సయ్య, బుర్రి రవి, బండి స్వామి, పన్యాల నాగరాజురెడ్డి, శ్యాంరెడ్డి, సందుల రాజు తదితరులు పాల్గొన్నారు.

వీడీసీ కార్యవర్గంలో మార్పులేదు

రామేశ్వర్‌పల్లి(భిక్కనూరు), న్యూస్‌టుడే: మండలంలోని రామేశ్వర్‌పల్లి వీడీసీ కార్యవర్గంలో ఎలాంటి మార్పులేదని డీసీసీబీ మాజీ ఛైర్మన్ ఎడ్లరాజిరెడ్డి బుధవారం తెలిపారు. ఇటీవల కొత్త వీడీసీ పాలకవర్గాన్ని ఎన్నుకున్నట్లు కొందరు తప్పుగా ప్రకటించుకున్నారన్నారు. వీడీసీ ఛైర్మన్‌గా పైళ్ల రాంరెడ్డి కొనసాగుతారన్నారు. కొత్త వీడీసీ ఎన్నిక గురించి ఈ నెల 29న సమావేశం జరుగుతుందన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. స్వాగత వేడుకలు

మాచారెడ్డి, న్యూస్‌టుడే: మాచారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం స్వాగత వేడుకలు నిర్వహించారు. ప్రథమ సంవత్సర విద్యార్థులకు ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఆటాపాటలతో స్వాగతించారు. విద్యార్థినుల నృత్యాలు అలరించాయి. మాచారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల జిల్లా స్థాయిలో ఉత్తమ ఫలితాలను సాధిస్తూ పేరుతెచ్చుకుంటోందని కళాశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ రాజమౌళిగుప్తా పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నవీన్‌కుమార్, జబీఉల్లా తదితరులు పాల్గొన్నారు.


నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు


ఆటలతో అలరిస్తున్న విద్యార్థినులు

ఇస్సానగర్‌లో గాయిత్రీ మహాయజ్ఞం

ఇస్సానగర్(దోమకొండ), న్యూస్‌టుడే: బీబీపేట మండలం ఇస్సానగర్‌లో బుధవారం హనుమాన్ దీక్ష సేవా సమితి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం గాయిత్రీ మహాయజ్ఞం నిర్వహించారు. హనుమాన్ దీక్ష భక్తులు ఆలయ ఆవరణంలో యజ్ఞం పూజల్లో పాల్గొని, స్వామి వారిని మొక్కుకున్నారు. గాయిత్రీ యజ్ఞం పూర్తి అయిన అనంతరం ఆలయం ఆవరణలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి రమణాగౌడ్, హనుమాన్ దీక్ష సేవా సమితి ప్రతినిధులు లింగాల యాదాగౌడ్, ఆశం శ్రీనివాస్‌గౌడ్, లింగాల యాదాగౌడ్, దేవరాజుగౌడ్, నారాయణరెడ్డి, బెస్త శ్రీను, సంగెపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ టీకాపై అవగాహన ర్యాలీ

భిక్కనూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో భిక్కనూరు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు బుధవారం ఎంఆర్ టీకా అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక విజ్ఞాన్ పాఠశాల విద్యార్థులు, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ర్యాలీ చేపట్టారు. జడ్పీటీసీ సభ్యుడు నంద రమేశ్, ఎంపీడీవో గోపాల్‌రావు, ఏఎంసీ ఛైర్మన్ అమృతారెడ్డి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 9 నెలల వయస్సు నుంచి 15 ఏళ్ల వరకు ఎంఆర్ టీకా తప్పకుండా వేయించాలని సూచించారు. తట్టు, పొంగు వంటి వ్యాధులను నిరోధించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీకేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో వచ్చేనెల 24 వరకు టీకా అందుబాటులో ఉంటుందన్నారు. అపోహలు పెట్టుకోకుండా తల్లిదండ్రులు పిల్లలకు బాధ్యతగా వేయించాలన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, రేణుకుమార్, ఎడ్ల రాజారెడ్డి, మహేందర్‌రెడ్డి, భూంరెడ్డి, బాపురెడ్డి, దర్శన్, రాజు, రవీందర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


భిక్కనూరులో ర్యాలీ ప్రారంభిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు నంద రమేశ్, ఎంపీడీవో

పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలి : జేసీ

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని జేసీ సత్తయ్య పేర్కొన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలో ఆయా పక్షాల ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హానికర రసాయనాలు చెరువులు, కుంటల్లో నీటిని కలుషితం చేస్తాయన్నారు. తద్వారా జీవరాశులకు ముప్పు వాటిల్లుతుందన్నారు. ప్రతి ఒక్కరు చైతన్యమై మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలన్నారు. విద్యానగర్ కాలనీ షిరిడీ సాయి నిలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలోనూ పాల్గొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి నిమ్మ దామోదర్‌రెడ్డి, కోశాధికారి గంగాధర్, ప్రతినిధులు మహేశ్‌గుప్తా, విద్యానగర్‌లో ఛైర్‌పర్సన్ సుష్మ, కౌన్సిలర్ అర్కల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



జేసీ సత్తయ్యకు మట్టి విగ్రహాన్ని అందిస్తున్న ప్రతినిధులు

సింగీతం ప్రాజెక్టు పరిశీలన

నిజాంసాగర్, న్యూస్‌టుడే: మండలంలోని సింగీతం ప్రాజెక్టు ద్వారా కొనసాగుతున్న నీటి విడుదలను బుధవారం నీటి పారుదలశాఖ ఈఈ మధుకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగీతం ప్రాజెక్టులో ప్రస్తుతం 416.50 మీటర్ల వరకు నీరు నిలువ ఉందని తెలిపారు. ఎగువ భాగం నుంచి 150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ప్రవహిస్తుండడంతో అంతేస్థాయిలో ఒక గేటు ద్వారా నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. కల్యాణి ప్రాజెక్టులో ప్రస్తుతం 409.50 మీటర్ల నీరు నిలువ ఉందని చెప్పారు. ఎగువ భాగం నుంచి 179 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో ప్రధాన కాలువకు అంతేస్థాయిలో నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ఆయన వెంట డీఈ దత్తాత్రి, ఏఈ శివ ఉన్నారు.



సింగీతం ప్రాజెక్టు ద్వారా విడుదలవుతున్న నీటిని పరిశీలిస్తున్న ఈఈ మధుకర్

సాగర్‌లో స్వల్పంగా పెరిగిన నీటి మట్టం

నిజాంసాగర్ ప్రాజెక్టులో బుధవారం సాయంత్రానికి 1215 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. నాలుగు రోజులుగా ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో జలాశయంలో స్వల్పంగా నీటిమట్టం పెరిగింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 1383.75 అడుగులతో 2.11 టీఎంసీల నీరు నిలువ ఉంది.

ఓకా- రామేశ్వరం రైలును కామారెడ్డిలో ఆపాలి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: ఓకా-రామేశ్వరం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను కామారెడ్డిలో ఆపాలని తెరాస ఆధ్వర్యంలో ఎంపీ బీబీపాటిల్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. జిల్లాకేంద్రంగా మారిన నేపథ్యంలో రైళ్లను ఆపే సౌకర్యాన్ని కల్పించాలన్నారు. కార్యక్రమంలో తెరాస సీనియర్ నాయకుడు రమేష్‌గుప్తా, ప్రతినిధులు రామకృష్ణ, సాయిదీప్, శేఖర్, రాములు, కృష్ణాకర్ తదితరులున్నారు.



ఎంపీ బీబీపాటిల్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రుణాలను ఆధాయాభివృద్ధికి వినియోగించాలి

ఐకేపీ ప్రాంతీయ సమన్వయకర్త రవీందర్‌రావు

మాచారెడ్డి, న్యూస్‌టుడే: డ్వాక్రా మహిళలు తీసుకున్న బ్యాంకు రుణాలను ఆధాయాభివృద్ధికి వినియోగించాలని ఐకేపీ ప్రాంతీయ సమన్వయకర్త రవీందర్‌రావు పేర్కొన్నారు. మాచారెడ్డి స్త్రీశక్తి భవన్‌లో బుధవారం నిర్వహించిన మండల మహిళా సమాఖ్య మహాజన సభలో ఆయన మాట్లాడారు. చిన్న సంఘాలు, గ్రామ సమాఖ్యలు పుస్తకాల నిర్వహణ, ఆర్థిక నిర్వహణ పక్కాగా చేపట్టి ఆర్థిక పరిపుష్టిని సాధించాలన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో మండల మహిళా సమాఖ్యలో జరిగిన ఆర్థిక లావాదేవీలను చర్చించి ఆమోదించారు. గత ఏడాది మండల సమాఖ్య రూ.4.63 లక్షల లాభం ఆర్జించినట్లు చెప్పారు. 2017-18 ఆర్థిక సంవతసరంలో చేపట్టనున్న ప్రణాళికను చర్చించారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య సిబ్బంది సీసీలను సన్మానించారు. మండల సమాఖ్యకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొని ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఏపీఎం మనోహర్, మండల మహిళా సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు ఆయా గ్రామ సమాఖ్యల అధ్యక్షురాళ్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐకేపీ ప్రాంతీయ సమన్వయకర్త రవీందర్‌రావు

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి: ఎంపీ

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ కవిత అన్నారు. బుధవారం నూతన అంబేడ్కర్ భవనంలో నిజామాబాద్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. దీనికి ఎంపీ కవిత, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా, నగర మేయర్ సుజాత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. జర్నలిస్టులను అన్ని రకాలుగా ఆదుకోవడానికి ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందన్నారు. ఉద్యమ సమయంలో తెలంగాణ జర్నలిస్టుల పాత్ర మరువలేనిదన్నారు. ఉద్యమ ఉనికి ప్రజలకు తెలియజేయడానికి ఎంతో శ్రమించారని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రభుత్వం జర్నలిస్టుల కోసం రూ.100 కోట్లతో సంక్షేమ నిధిని ఏర్పాటు చేసిందన్నారు. పాత్రికేయులకు అక్రిడేషన్, హెల్త్ కార్డులు అందించామన్నారు. వీటిని అందించడానికి కొద్దిగా ఆలస్యమైనా కూడా పాత్రికేయులు అనారోగ్యానికి గురైతే వారి చికిత్స కోసం ముఖ్యమంత్రి ప్రత్యేక నిధి నుంచి నిధులు కేటాయించి చికిత్సలు చేయించామన్నారు. మరణించిన పాత్రికేయుల కుటుంబంలో పిల్లల చదువుకు రూ.3 వేలు అందిస్తామని చెప్పారు. జర్నలిస్టుల ఇళ్ల సమస్యను పరిష్కరిస్తామన్నారు. రెండు పడక గదుల ఇళ్లు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తరువాత నూతనంగా ఏర్పడిన నిజామాబాద్ ప్రెస్‌క్లబ్ కార్యవర్గం, ప్రెస్ ఫొటోగ్రాఫర్స్ సంఘం కార్యవర్గంతో ప్రమాణా స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్‌లకు జ్ఞాపికలను అందజేశారు.



ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ కవిత

జీవం తీస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి) ఇతర రాష్ట్రాల నుంచి రవాణా కోసం ప్రభుత్వం లారీలను ఏర్పాటు చేస్తోంది. టెండర్ పక్రియ ద్వారా గుత్తేదారులకు అప్పగించారు. వాహన సామర్థ్యాన్ని బట్టి మూడు యూనిట్ల నుంచి పది యూనిట్ల వరకు తీసుకురావలి.

ఇలా జరుగుతోంది

☛ ఒక్కో వాహనంలో స్థాయికి మించి జీవాలను తీసుకొస్తున్నారు.

☛ మూడు యూనిట్లు పట్టే వాటిలో మరో రెండు యూనిట్ల గొర్రెలను తీసుకొస్తున్నారు.

☛ పది యూనిట్లు తెచ్చే వాటిలో 11, 12 యూనిట్ల గొర్రెలను తెస్తున్నారు.

☛ వాహనంలో సామర్థ్యానికి మంచి జీవాలు తీసుకురావడం వల్ల కదలలేని పరిస్థితి నెలకొంది.

☛ ఊపిరాడక అస్వస్థకు గురై చనిపోతున్నాయి.

మేత లేక నీరు అందక

☛ రవాణా సమయంలో జీవాలకు 10 నుంచి 12 గంటల వరకు నీరు, మేత ఉండటం లేదు. వాహనాల్ని మధ్యలో ఎక్కడా ఆపడం లేదు.

☛ సేకరణ కేంద్రాలకు గొర్రెలను తీసుకొచ్చి ఒకటి, రెండ్రోజులు ఉంచుతున్నారు. అక్కడ కూడా సరిగా నీరు, మేత ఇవ్వటం లేదు. దీంతో జీవాలు మృత్యువాతపడుతున్నాయి.

☛ 23న నస్రుల్లాబాద్‌కు తీసుకొచ్చిన వాటిల్లో 20 గొర్రెలు చనిపోయాయి.

200 కి.మీ. దూరంలో ఎక్కడ ఆపలేదు

సురంపల్లి నారాయణ, దుర్కి



200 కి.మీ దూరం నుంచి తీసుకొచ్చాం. ఎక్కడ కూడా ఆపలేదు. అందులో కొన్ని ఈనే దశలో ఉండటంతో ఊపిరాడక మృతి చెందాయి. 8 యూనిట్లు పట్టే లారీలో 11 యూనిట్ల వరకు గొర్రెలను తెచ్చారు. వందల కిలో మీటర్ల దూరం ప్రయాణించినప్పుడు కొంతసేపైనా ఆపాల్సి ఉంటుంది. నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలి.

రెండు రోజుల నుంచి గ్రాసం లేదు

రఘుపతి, దుర్కి



గొర్రెలకు రెండు రోజుల నుంచి మేత లేనట్లుంది. మేము అక్కడ మంగళవారం ఉదయం బయలుదేరాం. బుధవారం తెల్లవారుజామున సొంతూరికి చేరుకొన్నాం. జహీరాబాద్ వద్ద లారీని నిలిపి భోజనం చేశాం. మళ్లీ ఇక్కడకు చేరుకొనే వరకు లారీని ఆపలేదు. రెండు రోజుల నుంచి జీవాలకు మేత లేనట్లు ఉంది. దీంతోపాటు ఎక్కువ సంఖ్యలో జీవాలను ఒకే లారీలో తీసుకురావడం వల్ల మృతిచెందాయి.

మేత, నీరు లేనే లేదు

- బోధనం పోశెట్టి, దుర్కి



వందల కిలో మీటర్ల దూరం నుంచి తీసుకొచ్చాం.. ఎక్కడా వాటికి విశ్రాంతి లేదు. మేత, నీరు లేనే లేవు. మాకే ఆకలిసి తట్టుకోలేకపోయాము. మరీ మూగజీవాల పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ప్రయాణం సమయంలో వాటిని ఎక్కడైనా కొంత సేపు దింపి నీరు తాగించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. మధ్యలో కనీసం అవి ఎలా ఉన్నాయో చూద్దామన్న లారీ డ్రైవర్ లారీని ఆపలేదు. దీంతో అవి ఊపిరాడక మృతి చెందాయి.

జాగ్రత్తలు తీసుకోవాలని సూచించాం

డాక్టర్ రమేశ్, జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి

ఇతర రాష్ట్రాల్లో కొనుగోలు చేసిన జీవాలను తరలించే క్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించాం. స్థాయికి మించి ఎట్టి పరిస్థితుల్లో తరలించొద్దని చెప్పాం. రవాణా పరంగా ఇబ్బందులు రాకుండా చూస్తాం.

నాలుగు జిల్లాల అనుబంధం

(మొదటి పేజీ తరువాయి)

అఫిలియేషన్ కిందకు వస్తే కొత్త కళ రానుంది. ఆయా జిల్లాల పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలలను తెవివి అనుబంధంలోకి వస్తాయి. ప్రస్తుతం తెవివి పరిధిలో 74 డిగ్రీ, 17 పీజీ, 12 బీఈడీ, 4 ఎంబీఏ, 2 ఎంసీఏ కళాశాలలు మొత్తం 109 కళాశాలలు అనుబంధంగా ఉన్నాయి. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో 76 డిగ్రీ కళాశాలలు, 8 పీజీ కళాశాలలతో పాటు బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏతో కలిపి సుమారు 90 వరకు ఉంటాయి.

నాలుగు క్యాంపస్‌లు రూపాంతరం

☛ కొత్త జిల్లాల అనుబంధంతో తెలంగాణ విశ్వవిద్యాలయం నాలుగు కేంద్రాలుగా రూపాంతరం చెందనుంది.

☛ ప్రస్తుతం డిచ్‌పల్లిలో ప్రధాన కేంద్రం, సారంగాపూర్‌లో ఎడ్యుకేషన్ కేంద్రం, కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌లో దక్షిణ ప్రాంగణ కేంద్రాలు ఉన్నాయి.

☛ నిర్మల్‌లో పీజీ కేంద్రం ఉంది. ఇక్కడ ఎం.ఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఆంగ్లం కోర్సులు నడుస్తున్నాయి. తెవివి పరిధిలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఆంగ్ల కోర్సులు ఉన్నాయి. సోషయాలజీ కోర్సు లేదు. నిర్మల్ పీజీ కేంద్రంలో సోషయాలజీ కోర్సుతో కొత్తగా కోర్సు అందుబాటులోకి రానుంది.

తెవివి పరిధిలోకి వచ్చే కళాశాలలు

డిగ్రీ :	150
పీజీ :	25
బీఈడీ :	20
ఎంబీఏ,ఎంసీఏ :	12

విశ్వవిద్యాలయ అభివృద్ధికి బాటలు

☛ జిల్లాల అనుబంధ కళాశాలల పరిధిలో విస్తరించడంతో విశ్వవిద్యాలయం ప్రగతి బాటలో దూసుకెళ్లే అవకాశం ఉంది. అఫిలియేషన్ ఫీజు, విద్యాసంవత్సరం ఫీజులు తదితర రూపంలో విశ్వవిద్యాలయానికి ఏటా రూ.3 కోట్ల వరకు వచ్చే వీలుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అదనపు ఆదాయంతో విశ్వవిద్యాలయంలో కొత్త భవనాలు నిర్మాణం, సౌకర్యాల కల్పనకు ఉపయోగపడతాయి. అలాగే కొత్త కోర్సులు వచ్చే వీలుంది.

☛ తెవివి స్వతహాగా 'పీజీ ప్రవేశ పరీక్ష' నిర్వహించుకే అవకాశం ఏర్పడుతుంది.

ఇది శుభ పరిణామం

ఆచార్య పి. సాంబయ్య, ఉపకులపతి తెవివి



నిజామాబాద్, కామారెడ్డితో పాటు నిర్మల్, ఆదిలాబాద్‌లు తెవివి అనుబంధ పరిధిలోకి రావడం శుభ పరిణామం. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలను తెవివికి పరిధిలోకి మార్చాలని సీఎం కేసీఆర్, ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, ఉన్నత విద్యా మండలికి లేఖ రాశాం. అలాగే నిర్మల్ జిల్లాకు చెందిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో పాటు ప్రముఖ అధికారులను కలిశాం. తెవివికి అనుబంధ హోదా పరిధి పెంచితే జరిగే మేలు గురించి వివరించి ప్రభుత్వ పెద్దల దృష్టికి తెచ్చేలా చేశాయి. ఈ రెండు జిల్లాలు వస్తే వర్సిటీ అభివృద్ధికి దోహదపడుతుంది. ముఖ్యంగా నిర్మల్ జిల్లాలో పీజీ కేంద్రం ఉంది. బాసర పుణ్యక్షేత్రం మన పరిధిలోకి రావడం శుభ సూచికంగా భావిస్తున్నాం. నాలుగు జిల్లాల పరిధిగా తెవివిని ప్రభుత్వం విస్తరిస్తుందనే నమ్మకం ఉంది.

భోంచేస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి) మరో రూ.15 లక్షలు ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వం కోట్లు ఖర్చు చేసినప్పటికీ పర్యవేక్షణ లేకపోవడంతో పక్కదారి పడుతుంది.

గుడ్డు గుటకాయస్వాహా

● నిత్యం మెనూ ప్రకారం భోజనం అందించాల్సి ఉండగా చాలా పాఠశాలల్లో మెనూ పాటించకుండా నీళ్లచారుతోనే పెడుతున్నారు. వారానికి మూడు గుడ్లు అందించాల్సి ఉండగా ఎక్కడ కూడా పాటించడం లేదు.

ఎస్ఎంఎస్ మరిచారు

☛ మధ్యాహ్న భోజనం వివరాలను ప్రతి రోజు విద్యార్థుల హాజరు సంఖ్యతో పాటు 15544 నంబరకు సమాచారం(ఎస్ఎంఎస్) ఇవ్వాలి. కానీ చాలా వరకు పాఠశాలల్లో ఎస్ఎంఎస్ మరిచిపోయారు. ఒక వేళ చేసినా అంతా తప్పుల తడకే. విద్యార్థుల హాజరుకు ఎస్ఎంఎస్ చేసిన సంఖ్యకు పొంతన ఉండదు.

పర్యవేక్షణ లేక

☛ క్లస్టర్ పరిధిలో సీఆర్‌పీలు విధులు నిర్వహిస్తారు. వారు వారి పరిధిలోని పాఠశాలల్లో పర్యవేక్షణ చేయాల్సి ఉండగా జిల్లాలో చాలా వరకు పాఠశాలల్లో సీఆర్‌పీలు పర్యవేక్షణ చేయడం మానేశారు.

పక్కదారి పట్టకుండా చర్యలు

బలిరాం రాథోడ్, ఎంఈవో

మండలంలో మధ్యాహ్న భోజనం పథకం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకుంటాం. నిత్యం విద్యార్థుల హాజరుకు అనుగుణంగానే బియ్యాన్ని అందించాలి. అంతే కానీ అందుకు విరుద్ధంగా చేస్తే చర్యలు తప్పవు. ప్రతి రోజు ఎస్ఎంఎస్ పంపించాలి.

☛ నిజాంసాగర్ మండలం బ్రాహ్మణపల్లి పాఠశాలలో 17 తేదీకి సంబంధించి మధ్యాహ్నభోజనం చేసిన విద్యార్థుల సమాచారం నేటికీ పంపించలేదు.

ఈరెండు ఉదాహరణలు చాలు ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలుతీరు ఎలా ఉందో అర్థం చేసుకోవడానికి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మధ్యాహ్న భోజనం పక్కదారి పడుతోంది. విద్యాశాఖకు కేంద్రం నాలుగు పర్యాయాలు అక్షింతలు వేసినా నిర్వహణలో మార్పు రావడం లేదు.

విషప్రభావంతో రైతు మృతి

పెద్దతక్కడ్‌పల్లి(బిచ్కుంద), న్యూస్‌టుడే: బిచ్కుంద మండలం పెద్దతక్కడ్‌పల్లిలో విష ప్రభావంతో ఓ రైతు మృతి చెందాడు. గ్రామస్థుల కథనం ప్రకారం.. నారాయణ తన పొలంలో సోయాపంటకు పురుగు మందును పిచికారి చేయడానికి వెళ్లారు. పంపు ద్వారా పిచికారీ చేస్తున్న సమయంలో స్ప్రే చేస్తున్న పైపు పగిలి ముఖంపై మందు పడింది. దీంతో ఆయన స్పృహకోల్పోయారు. ఆస్పత్రికి తరలిస్తున్న సమయంలో మార్గమధ్యలో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బంధువులు చెప్పారు.



నారాయణ మృతదేహం

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కందర్‌పల్లి(బిచ్కుంద), న్యూస్‌టుడే: మండలంలోని కందర్‌పల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం పిట్లంకు చెందిన కిందింటి పండరి(25), సిద్దపూర్‌కు చెందిన లావణ్య(19) దెగ్లూర్ నుంచి పిట్లంకు వెళ్తున్న సమయంలో హైదారాబాద్ నుంచి దెగ్లూర్‌కు వెళ్తున కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో పండరి అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడ్డ లావణ్యను చికిత్స నిమిత్తం 108లో బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ అర్రము తెలిపారు.



పండరి మృతదేహం

భార్యతో గొడవ పడి ఆత్మహత్య

సాటాపూర్(రెంజల్), న్యూస్‌టుడే: భార్యతో గొడవపడి మనస్తాపానికి గురైన భర్త ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని సాటాపూర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రభాకర్ అందించిన వివరాల ప్రకారం.. సాటాపూర్ గ్రామానికి చెందిన కల్లెం గంగాధర్- లక్ష్మి దంపతులు మంగళవారం రాత్రి ఆర్థిక ఇబ్బందుల విషయమై గొడవపడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన కల్లెం గంగాధర్(28) బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఉన్న పంట పొలానికి వినియోగించే విషగుళికలు మింగేశారు. అపస్మారక స్థితికి చేరుకున్న ఆయన్ను కుటుంబీకులు చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అయిదు దేవాలయాలకు పాలక మండళ్ల నియామకం

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: దేవాదాయశాఖ పరిధిలోని నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన దేవాలయాల నూతన పాలకమండళ్ల నియామక ప్రక్రియను చేపట్టారు. అయిదు ఆలయాలకు రాష్ట్రశాఖ అధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి. చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, మాచారెడ్డి సత్యనారాయణ మందిరం నీలకంఠేశ్వరాలయం, శంభునిగుడి, జెండాబాలాజీ ఆలయాలున్నాయి. ఇందులో చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి మందిరం పాలకమండలి ప్రమాణం చేసింది. గురువారం శంభునిగుడి పాలక మండలి ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దేవాదాయశాఖ ఉమ్మడి జిల్లాల సహాయ కమిషనర్ సోమయ్య 'న్యూస్‌టుడే'తో తెలిపారు. ఇదివరకే 16 ఆలయాలకు ధర్మకర్త మండళ్లను నియమించామన్నారు. మిగిలిన మాధవనగర్ సాయిబాబా ఆలయం, బోధన్ శివమందిరం, ఖుదావన్‌పూర్ ఎల్లమ్మ ఆలయాలకు పాలక మండలిని త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మట్టితో మాయ.. విభిన్న రూపాయ..








మట్టి వినాయకులనే నెలకొల్పాలని ప్రభుత్వం, అధికారులు, పాలకులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. కాలుష్య నివారణకు సహకరించాలని పెద్దఎత్తున ప్రచారం చేయడంతో ప్రజల్లో చైతన్యం వచ్చింది.. గతంలో చిన్న విగ్రహాలనే మట్టితో తయారు చేసేవారు. కోల్‌కతా నుంచి వచ్చిన కళాకారులు నిజామాబాద్ నగరంలో మట్టితో పెద్ద విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఇవి ఆకట్టుకునే రూపాల్లో ఉన్నాయి.

-ఈనాడు, నిజామాబాద్







నైపుణ్యాభివృద్ధిరస్తు

■ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విజ్ఞాన కేంద్రాలు

■ ఉన్నత విద్య, ఉపాధికి బాటలు



న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం

ఒక విద్యార్థి ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే విద్యతో పాటు ఇతర నైపుణ్యాలు అవసరం. ప్రస్తుత కాలంలో అయితే విద్యార్హత కంటే ఎక్కువగా వారిలో అంతర్గతంగా ఉన్న నైపుణ్యాలపైనే దృష్టిపెడుతున్నారు. అందుకే ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థి దశ నుంచే అనేక అంశాల్లో నైపుణ్యాలపై తర్ఫీదునిస్తున్నారు. దీంతో వివిధ రంగాల్లో ప్రైవేటు విద్యార్థులే ఎక్కువగా స్థిర పడుతున్నారు. ఇది గమనించిన ప్రభుత్వం.. ప్రభుత్వ కళాశాలల్లో అభ్యసించే వారికోసం నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. విద్యార్థుల్లో ధైర్యాన్ని నింపి నైపుణ్యాలు అందించటంతో పాటు కంప్యూటర్ విద్యలోనూ పట్టు సాధించేలా కృషి చేస్తోంది. తెలంగాణ నైపుణ్య, విజ్ఞాన కేంద్రాల ద్వారా ఆయా అంశాల్లో పట్టు సాధించేలా ఏర్పాట్లు చేసింది.

జవహర్ విజ్ఞాన కేంద్రాల ద్వారా..

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎక్కువశాతం తెలుగు మాధ్యమంలో అభ్యసించిన వారే ఉంటారు. వీరికి నైపుణ్యాలపై అంతగా పట్టు ఉండదు. ఇటువంటి వారిని ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు 2007లో అప్పటి ప్రభుత్వం జవహర్ నాలెడ్జ్ సెంటర్‌ని ప్రారంభించింది. ప్రతి ప్రభుత్వ కళాశాలలో కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక సమన్వయకర్తలను నియమించింది.

తెలంగాణ ఏర్పాటుతో..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ కేంద్రాన్ని తెలంగాణ నైపుణ్య, విజ్ఞాన కేంద్రం(టీఎస్‌కేసీ)గా పేరు మార్చారు. ప్రతి విద్యార్థి చదువుకొంటూనే ఉన్నత విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో చేయూతనందించడమే టీఎస్‌కేసీ ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం నిజామాబాద్‌లో గిరిరాజ్ కళాశాల, ఆర్మూర్, భీమ్‌గల్, మోర్తాడ్, ధర్పల్లి, బోధన్ మధుమలాంచ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కామారెడ్డి జిల్లాలో ఎల్లారెడ్డి, బిచ్కుంద, బాన్సువాడ, కామారెడ్డి డిగ్రీ కళాశాలల్లో కేంద్రాలున్నాయి.

ఈ ఏడాది మరింత ప్రాధాన్యం

గతంలో టీఎస్‌కేసీ తరగతులు కేవలం వారానికి రెండు మాత్రమే ఉండేవి. ఈ ఏడాది నుంచి విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని మార్పులు చేశారు. నైపుణ్యాలపై మరింత పట్టు పెంచేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. గతేడాది వరకు కేవలం మూడునెలలు, ఆరునెలల కోర్సు మాత్రమే ఉండేది. ఈసారి నుంచి విద్యా సంవత్సరమంతా బోధించనున్నారు. నిత్యం జరిగే తరగతుల మాదిరిగానే టీఎస్‌కేసీకి కూడా ప్రత్యేక తరగతిని కేటాయించారు. అన్ని గ్రూపుల వారికి ఒక్కో తరగతి కేటాయించి శిక్షణనిస్తున్నారు.



ప్రాంగణ నియామకాల్లో ఎంపికైన విద్యార్థులు (పాతచిత్రం)

చదువుతున్న సమయంలోనే..- రాధిక, విప్రో



నేను గిరిరాజ్ కళాశాలలో డిగ్రీ చేస్తున్నప్పుడు జేకేసీలో ప్రవేశం పొందాను. ఎన్నో అంశాలను నేర్పారు. తృతీయ సంవత్సరం చదువుతున్నప్పుడే విప్రో వాళ్లు ప్రాంగణ నియామకాలు చేపట్టారు. అధ్యాపకులు చెప్పిన అంశాలు ఎంతో తోడ్పడ్డాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాను.

అన్ని గ్రూపుల వారికి

- అనూష, టీఎస్‌కేసీ మెంటర్(గిరిరాజ్ కళాశాల)



కళాశాలల్లోని అన్ని గ్రూపుల వారికి తరగతులను బోధిస్తున్నాం. భాషానైపుణ్యం, కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణనిస్తున్నాం. తెలుగు మాధ్యమం విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ బోధన కొనసాగిస్తున్నాం. విద్యార్థులు ప్రతి అంశంలో నైపుణ్యం సాధించేలా తరగతులు ఉంటాయి.

మంచి అవకాశం రాజేశ్, సమన్వయకర్త



ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అభ్యసించే విద్యార్థులకు ఇదో మంచి అవకాశం. నైపుణ్యాలతో పాటు ఉద్యోగావకాశాలు ఉంటాయి. ప్రతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశపెట్టారు. ఇందుకు కళాశాలల్లో ప్రత్యేక కంప్యూటర్ ప్రయోగశాలనే ఏర్పాటు చేశాం. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

శిక్షణనిచ్చే అంశాలు

ఉన్నతవిద్యకు, ఉపాధికి అవసరమయ్యే ప్రతి అంశాన్ని విద్యార్థులకు అందిస్తున్నారు. ముఖ్యంగా తెలుగు, ఉర్దూ మాధ్యమ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

- సంభాషణ నైపుణ్యం
- ఆంగ్లభాషపై పట్టు
- కంప్యూటర్ విజ్ఞానం
- వ్యక్తిత్వ వికాసం
- మెంటల్ ఎబిలిటి
- ముఖాముఖిని ఎదుర్కోవటం
- కెరీర్ గైడెన్స్

ప్రత్యేక తరగతులు

విద్యార్థులను చైతన్య పర్చేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సంబంధిత కళాశాలల్లో బోధించే అధ్యాపకులతో వారానికి ఒకసారి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యాపరంగా వారు ఎదుర్కొంటున్న ఒడుదొడుకులు, విజయం సాధించిన అంశాలను విద్యార్థులతో పంచుకొంటున్నారు. ఉన్నతస్థాయిలో స్థిరపడిన వారి జీవితచరిత్ర, విద్యావేత్తల విజయాలు.. ఇలా అనేక అంశాలను విద్యార్థులకు బోధిస్తూ చైతన్య పర్చుతున్నారు. ఉద్యోగాల్లో ముఖాముఖిని ఎదుర్కోవడం, పోటీ పరీక్షలకు సన్నద్ధం, ఎటువంటి అంశాలను నేర్చుకోవాలో వివరిస్తున్నారు. విద్యార్థులు కూడా టీఎస్‌కేసీలో నేర్చుకున్న అంశాలను బోధించేలా ఏర్పాట్లు చేశారు.

ప్రాంగణ నియామకాలు

టీఎస్‌కేసీలో శిక్షణ తీసుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. ప్రైవేటు కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకొని ప్రతి ఏడాది ప్రాంగణ నియామకాలు చేపడుతోంది. ఇలా ఇప్పటి వరకు సుమారు 50 మంది విద్యార్థులు ఆయా కంపెనీల్లో ఉద్యోగం పొందారు. 2015-16 విద్యా సంవత్సరంలో 25 మంది, 2016-17లో 13 మంది విద్యార్థులు ఉద్యోగాన్ని అందుకొన్నారు. డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతూనే ఉద్యోగం సంపాదించేలా చేయడమే టీఎస్‌కేసీ ప్రధాన లక్ష్యం.



పచ్చదనానికి ప్రాధాన్యం ప్రగతికి సహకారం



ఇంటి ఆవరణలో పచ్చదనం కోసం పెంచిన మొక్కలు

న్యూస్‌టుడే, ఖలీల్‌వాడి, కంఠేశ్వర్

పచ్చని మొక్కలు.. ఆహ్లాదకరమైన వాతావరణం.. రోడ్డుకు ఇరువైపులా మొక్కలతో కాలనీ పచ్చనిహారంలా కనిపిస్తోంది. ఇది ఎక్కడో లేదు.. జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ వద్ద గల మారుతినగర్ కాలనీ. ఈ కాలనీలోకి అడుగు పెడితే పచ్చని మొక్కలు స్వాగతం పలుకుతాయి. మదిని దోచే ప్రశాంతమైన వాతావరణం అందరిని ఆకట్టుకుంటోంది. కాలనీవాసుల ఐక్యత.. సమష్టికి ఇది నిదర్శనం. కాలనీ అభివృద్ధికి తీసుకున్న చర్యలు.. చేపడుతున్న కార్యక్రమాలపై అందిస్తున్న కథనం.

జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న మారుతినగర్ కాలనీ 1995లో కేవలం 10 నివాసాలతో కాలనీ ఏర్పడింది. ఇప్పటికి 21 ఏళ్లు గడిచాయి. ప్రస్తుతం కాలనీలో సుమారు 500 కుటుంబాలున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా కాలనీని అభివృద్ధి పరుస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు స్థానికులు. కాలనీ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు పచ్చదనానికి ప్రతి ఒక్కరు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీనిని ఇలానే కొనసాగిస్తూ ప్రభుత్వాలు చేపడుతున్న వివిధ కార్యక్రమాలకు మద్దతు తెలుపుతూ వాటిని కాలనీలో మొదట అమలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. కాలనీలో ఏ ఇంటి ముంగిట చూసినా పచ్చని మొక్కలే కనిపిస్తాయి.

ఆదర్శం.. మారుతినగర్ కాలనీ



అంజలి పార్కుల వద్ద రోడ్డుకు ఇరువైపుల పెరిగిన మొక్కలు

అభివృద్ధి కమిటీ ఏర్పాటుతో ముందుకు

20 ఏళ్ల కిందట కాలనీ అభివృద్ధికి కమిటీ ఏర్పాటయ్యాక వసతులు సమకూర్చుకున్నారు. మొదట్లో 25 మందితో కమిటీని ప్రారంభించారు. ప్రస్తుతం 500 మంది సభ్యులున్నారు. కాలనీ అభివృద్ధికి సంబంధించిన ఏ విషయాన్ని అయినా అందరు కలిసి సమావేశమై నిర్ణయం తీసుకుంటారు. ఇలా చేసే ప్రతి కార్యక్రమాన్ని పండగ వాతావరణం తలపించే విధంగా చక్కగా ఏర్పాట్లు చేసుకొని నిర్వహిస్తారు. ఇలా కాలనీలో నిర్వహించే కార్యక్రమాలు అందరిని ఆకట్టుకుంటున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం, వినాయకచవితి, దసరా, దీపావళి, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.. ఇలా పలు రకాల పండగలు జరుపుకుంటున్నారు.

పచ్చదనమే పరమావధిగా..

మారుతినగర్ కాలనీలో పచ్చదనం పరిఢవిల్లుతోంది. ఎటు చూసిన పచ్చని మొక్కలు.. ఆహ్లాదకరమైన వాతావరణమే కనిపిస్తుంది. ప్రతి ఇంట్లో మొక్కలు, గార్డెన్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేసుకున్నారు. కాలనీలో మొక్కలు నాటడానికి ప్రతి ఒక్కరు ముందుకు వస్తారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛభారత్ , తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం తలపెట్టిన కాలనీ సభ్యులు స్వచ్ఛందంగా కదిలివచ్చి కార్యక్రమాన్ని అమలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. హరితహారంలో భాగంగా ఇప్పటి వరకు కాలనీలో సుమారు 200 మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించడానికి రక్షణ చర్యలు చేపడుతున్నారు. వేసవి కాలంలో మొక్కలకు నీరందించడానికి కమిటీ ఆధ్వర్యంలో పోగు చేసిన డబ్బును ఖర్చు చేస్తూ వాటిని కాపాడుతున్నారు. ప్రతి నెల కమిటీ సమావేశమై కాలనీ అభివృద్ధి విషయాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటారు. ఇప్పటి వరకు కాలనీ కోసం సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు. ప్రజాప్రతినిధులు కూడా సహకారం అందిస్తున్నారు. కాలనీలో ఉన్న పార్కును అభివృద్ధి చేయడానికి, రోడ్ల ఏర్పాటుకు సహకారం అందిస్తానని అర్బన్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు.

పండ్లు, పూల మొక్కలు ఎక్కువ..

కాలనీలో ఎక్కువగా పండ్లు, పూల నిచ్చే మొక్కలు ఎక్కువగా ఉన్నాయి. ఇందులో ముఖ్యంగా జామ, మామిడి, దానిమ్మ, అల్లనేరేడు, ఉసిరి, నిమ్మ.. ఇలా పండ్ల మొక్కలున్నాయి. అలాగే ఇంట్లో ఉన్న పెరటి స్థలాల్లో వంకాయ, బెండకాయ, బీరకాయ, కరివేపాకు, మునగ లాంటి మొక్కలు ఎక్కువగా పెంచుతున్నారు. గులాబీ, మందారం, మల్లే, బొన్‌సాయి మొక్కలు.. ఇంటికి అందాన్నిచ్చే మొక్కలు ఎక్కువ పెంచుతున్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి: రాజేందర్‌రెడ్డి, మారుతినగర్ నార్త్ బ్లాక్ అధ్యక్షుడు



మారుతి నగర్ కాలనీ నార్త్‌బ్లాక్ అభివృద్ధికి కాలనీ సభ్యులందరం ముందుంటాం. పచ్చని మొక్కలు పెంచడానికి ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నాం. గత 21 సంవత్సరాల నుంచి సభ్యులందరం ఐక్యంగా ఉంటు అభివృద్ధి విషయాలపై దృష్టి సారిస్తున్నాం. మొక్కల సంరక్షణ కోసం రెండేళ్లలో వంద వరకు ట్రీగార్డులు కొనుగోలు చేశారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం అందరి బాధ్యత.

శుభ్రతకు మొదటి ప్రాధాన్యం: -సునందారెడ్డి, కాలనీవాసి



మారుతినగర్ నార్త్‌బ్లాక్‌లో ఎవరు కూడా రోడ్డు పైన చెత్త వేయకుండా శుభ్రత పాటిస్తున్నాం. ప్రతి ఇంట్లో చెత్త డబ్బాలను ఏర్పాటు చేసుకొని ఆ చెత్తను తీసుకువెళ్లడానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసుకున్నాం. కాలనీ సభ్యులందరూ కలిసి పండగలను సమష్టిగా జరుపుకుంటాం. అందరూ సహకరించడం వల్లే కాలనీ ప్రగతి బాటలో ముందుకు సాగుతోంది.

భిన్న భాషల బడి



☛ మూడు భాషల్లో పట్టు

☛ ప్రత్యేకం మద్నూర్ పాఠశాల

న్యూస్‌టుడే, మద్నూర్

భాషలు, ప్రాంతాలు వేరైనా విద్యార్థులంతా కలసి కట్టుగా చదువుకొంటున్నారు. సోదరభావంతో ఒకే ప్రాంగణంలో విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నారు. మూడు భాషల మాధ్యమాల పాఠశాలలు ఒకే దగ్గర ఉండటంతో విద్యార్థులే కాదు..ఉపాధ్యాయులు సైతం మూడు భాషలపై పట్టు సాధిస్తున్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శంగా నిలుస్తోన్న సర్కారుబడిపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం మహారాష్ట్ర సరిహద్దులో ఉంటుంది. ఇక్కడ జిల్లా పరిషత్తు ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో తెలుగు, ఉర్దూ, మరాఠీ మాధ్యమ ఉన్నాయి. అయితే విద్యార్థులందరూ ఒకే ప్రాంగణంలో చదువుకొంటున్నందున మూడు భాషల్లోనూ అనర్గళంగా మాట్లాడుతున్నారు. ఆయా పాఠశాలల్లో చదువుకొంటున్న విద్యార్థులు విరామ సమయంలో ఒకరితో ఒకరు వారి వారి మాతృభాషల్లో మాట్లాడటంతో పాటు ఎదుటివారి భాషల్లోనూ మాట్లాడుతున్నారు. దీంతో ఒకరి భాషపై మరొకరు పట్టుసాధిస్తున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

నిజాంకాలంలో..

మహారాష్ట్ర సరిహద్దు కావడంతో ఈ ప్రాంతంలో తెలుగు, మరాఠీ, ఉర్దూ, ఆంగ్లం, కన్నడ భాషలను ఇక్కడి ప్రజలు మాట్లాడుతుంటారు. ఏడోనిజాం మీర్‌ఉస్మాన్‌అలీఖాన్ పాలన కొనసాగుతున్న సమయంలో 1938లో ఇక్కడ ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేశారు. మద్నూర్ మండలం అప్పట్లో మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో ఉండేది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోకి మార్చారు. అయితే మరాఠీ పాఠశాలలు మాత్రం ఇక్కడే ఉండిపోయాయి.

ఉభయ జిల్లాల్లో కనబడదు

ఉభయ జిల్లాల్లో ఎక్కడా లేని విధంగా మద్నూర్ మండలంలోనే ఇలా వివిధ భాషలపై పాఠశాలలు ఉండటం విశేషం. ఇక్కడ చదువుకొంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఏ రాష్ట్రానికి వెళ్లినా భాషాపరమైన ఇబ్బందులు ఉండవు. ఏ భాషాలోనైనా అనర్గళంగా మాట్లాడుతారు.



చదువుకుంటున్న విద్యార్థులు

మూడు మాధ్యమాల్లో

జిల్లా పరిషత్ బాలుర(తెలుగు)లో ఆరోతరగతి నుంచి పదోతరగతి వరకు 440 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. ఇదే పాఠశాలలో మరాఠీ మాధ్యమంలో ఆరు నుంచి పది వరకు వందమంది విద్యార్థులు ఉన్నారు. ఇదే ప్రాంగణంలో జిల్లా పరిషత్ ఉర్దూ మాధ్యమంలో సైతం ఆరు నుంచి పది వరకు 106 మంది విద్యార్థులు ఉన్నారు. తెలుగుమీడియం ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదోతరగతి వరకు 165 మంది, మరాఠీ మాధ్యమంలో 34 మంది, ఉర్దూ మాధ్యమంలో 88 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. ఇలా ఒకే ప్రాంగణంలో మూడు భాషల్లో మొత్తం 953 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి బోధించేందుకు మద్నూర్‌తో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. దూర ప్రాంతం నుంచి వచ్చిన ఉపాధ్యాయులు సైతం మూడు భాషల్లో పట్టు సాధిస్తున్నారు.

చక్కని వేదిక - సునీల్, ఉపాధ్యాయుడు



మహారాష్ట్ర సరిహద్దు కావడంతో ఈ మండలంలో తెలుగు, మరాఠీ, ఉర్దూ మీడియం పాఠశాలలు ఉన్నాయి. అయితే ఒకే ప్రాంగణంలో వివిధ భాషల పాఠశాలలు ఉండటం చక్కని వేదికగా మారింది.

ఒకే కార్యాలయం - దొండిరాం, ఉపాధ్యాయుడు



మూడు భాషల్లో బోధించే ఉపాధ్యాయులందరం ఒకే కార్యాలయ గదిలో కూర్చుంటాం. దీంతో ఇక్కడి ఉపాధ్యాయులకు వివిధ భాషల్లో పట్టు వస్తోంది. విద్యార్థులు సైతం అన్ని భాషలపై పట్టు సాధిస్తున్నారు.

కలసే పనులు - నిఖిత, విద్యార్థి



వివిధ మూడు మాతృభాషల విద్యార్థులు ఉన్నా వేరేగా చదువుకొంటున్నా.. అందరం కలిసే ఉంటాం. పాఠశాల కార్యక్రమాలు, భోజనాలు, మాట్లాడుకోవడం, కలిసి పనిచేయటం.. అన్నీ కలిసే చేస్తాం.

చూసేవారికి వింత : సనా సుల్తానా



వివిధ భాషల్లోని పాఠశాలలు ఒకే భవనంలో కొనసాగుతుంటడంతో విద్యార్థులందరం అన్ని భాషల్లో మాట్లాడుతుంటారు. ఇది చూసేవారికి కొత్తగా, విచిత్రంగా అనిపిస్తుంది. మాకు మాత్రం సంబరంగా ఉంటుంది.

సంపూర్ణ స్వచ్ఛత సుదూరం..




ఇది నందిపేట్ గ్రామంలో ఓ లబ్ధిదారుడు కొంత కాలం క్రితం నిర్మించుకున్న మరుగుదొడ్డి. మంజూరు సమయంలో ఇతను అధికారులకు రూ.900డీడీ ఇచ్చాడు. నిర్మాణం పూర్తయి చాలా కాలం గడిచినా ఇప్పటికీ వస్తువులు కొనుగోలు చేసి ఇవ్వలేదు. దీంతో ఇతను ఈ మరుగుదొడ్డిని వినియోగించడం లేదు.

స్వచ్ఛతలో భాగంగా ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా ప్రజలకు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించి ఇస్తోంది. వాటిని వినియోగించేలా ప్రజల్లో చైతన్యం తీసుకు రావడంలో మాత్రం విఫలమవుతోంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే ఉద్దేశంతో గతంలో అధికారులు స్వచ్ఛత వస్తువుల కొనుగోలు నిమిత్తం ఉమ్మడి జిల్లాల్లోని లబ్ధిదారుల నుంచి రూ.12.62కోట్లు వసూలు చేశారు. ఇప్పటి వరకు ఏ ఒక్క లబ్ధిదారునికి కూడా వస్తువులు కొనుగోలు చేసి ఇవ్వలేదు. దీంతో సంపూర్ణ స్వచ్ఛత పథకం లక్ష్యం నీరుగారుతోంది.

అటకెక్కిన వస్తువుల సరఫరా

గ్రామీణ ప్రజలకు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించి ఇచ్చినా అవగాహన లేమితో వాటిని వినియోగించడం లేదు. మరుగుదొడ్ల వినియోగానికి అవసర మైన వస్తువులు వారి దగ్గర లేక పోవడంతో ఈ పరిస్థితి ఎదురవుతుందని వివిధ సర్వేల్లో తేలింది. దీంతో ఈ పరిస్థితిని మార్చడానికి సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారు. మరుగుదొడ్డి నిర్మించుకునే లబ్ధిదారుడు తన వాటా కింద రూ.900 చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. మరుగుదొడ్డి నిర్మాణం అనంతరం దాని వినియోగానికి అవసరమైన వివిధ వస్తువులు కొనుగోలు చేసి ఇస్తామని నిజామాబాద్ జిల్లాలో 63322మంది లబ్ధిదారుల నుంచి రూ.5.69 కోట్లు, కామారెడ్డి జిల్లాలో 76907 మంది లబ్ధిదారుల నుంచి రూ.6.92 కోట్లు వసూలు చేశారు. ఈ ప్రక్రియ ముగిసి రెండు సంవత్సరాలు పూర్తవుతున్నా ఇప్పటికి రెండు జిల్లాల్లోని ఒక్క లబ్ధిదారునికి కూడా వస్తువులు కొనుగోలు చేసి ఇవ్వలేదు.

– న్యూస్‌టుడే, నందిపేట్



అలసత్వంతో..

మరుగుదొడ్లను వినియోగించేలా ప్రజల్లో అవగాహన కల్పించడంలో సంబంధిత శాఖ అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. దీంతో మరుగుదొడ్లు ఉన్న చాలా మంది బహిర్భూమికి వెళ్తున్నారు. వీటి నిర్మాణ విషయంలో ఉన్నతాధికారులు మండల అధికారులకు లక్ష్య నిర్దేశన చేస్తున్నారు. కాని పథక లక్ష్యం నెరవేరేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మాత్రం మార్గదర్శకాలు జారీ చేయడం లేదు. దీంతో మండల అధికారులు మరుగుదొడ్ల నిర్మాణాలపైనే దృష్టి సారిస్తున్నారు తప్ప ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చే కార్యక్రమాలు చేపట్టడం లేదు.

రెండు జిల్లాల్లో మరుగుదొడ్ల వివరాలు

మొత్తం కుటుంబాలు	:	696994
రూ.900 డీడీతో మంజూరైన మరుడుదొడ్లు	:	140229
పూర్తయినవి	:	110126
ఇప్పటికి మరుగుదొడ్లు లేని కుటుంబాలు	:	36వేలు



ఇది తొండాకూర్ గ్రామంలో ఓ లబ్ధిదారుడు నిర్మించుకున్న మరుగుదొడ్డి. వినియోగ ఆవశ్యకతపై అవగాహన లేకపోవడంతో అది అలంకార ప్రాయంగా మారింది. ఇలాంటి వారికి రూ.900తో వస్తువులు కొనుగోలు చేసి ఇస్తే మరుగుదొడ్డి వినియోగానికి అలవాటు పడుతారు. కాని అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

స్పందించని సంఘాలు

స్వచ్ఛత వస్తువుల కొనుగోలు నిమిత్తం సంబంధిత అధికారులు లబ్ధిదారుల నుంచి ఉభయ జిల్లాల్లో రూ.12.62కోట్లు వసూలు చేసి ఆయా గ్రామ స్వయం సహాయక సంఘాల ఖాతాల్లో జమ చేశారు. ఏ గ్రామంలోనైతే వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తవుతుందో ఆ గ్రామాల్లోని లబ్ధిదారులకు స్వచ్ఛత వస్తువులు కొనుగోలు చేసి ఇవ్వాలని ఉన్నతాధికారులు మండల అధికారులకు, గ్రామ సంఘాలకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే రెండు జిల్లాల్లో చాలా ఓడీఎఫ్ గ్రామాలను ప్రకటించారు. ఎక్కడ కూడా ఐకేపీ స్పందించి వస్తువులు కొనుగోలు చేసి ఇచ్చిన దాఖలాలు లేవు.

మండల అధికారులకు ఆదేశాలు జారీ చేశాం

వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయిన గ్రామాల్లోని వారికి వస్తువులు కొనుగోలు చేయాలని ఐకేపీ శాఖకు ఆదేశాలు జారీ చేశారు. మండల అధికారుల సూచనల మేరకు గ్రామ సంఘాలు వస్తువులు కొనుగోలు చేసి ఇస్తారు. ఈ కార్యక్రమం వేగవంతమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- సంధ్యారాణి, ఐకేపీ డీపీఎం



మాట్లాడుతున్న కార్మిక సంఘాల ప్రతినిధులు

ఉన్నతాధికారుల ఆదేశాలు పట్టవా?

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: మున్సిపల్ కార్మికులకు బకాయి పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని పాలనాధికారి సత్యనారాయణ జారీచేసిన ఆదేశాలను అధికారులు పట్టించుకోవడం లేదని కార్మిక సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నెలల తరబడి పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించకపోవడం అన్యాయమన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సకాలంలో చెల్లించకపోవడంతో గతంలో న్యాయస్థానం జరిమాన విధించిందన్నారు. ఇన్‌ఛార్జి కమిషనర్‌గా ఉన్న ఆర్డీవో శ్రీను ఈ విషయంలో జాప్యం చేస్తున్నారన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు లక్ష్మణ్, నర్సింగ్‌రావు, ఆయాజ్, రాజనర్సు పాల్గొన్నారు.



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న సెర్ఫ్ ఉద్యోగులు

కరపత్రాల విడుదల

మాచారెడ్డి, న్యూస్‌టుడే: బహుజన పుస్తకావిష్కరణ మహోత్సవ కరత్రాలను దళిత సంఘాల ఆధ్వర్యంలో మాచారెడ్డిచౌరస్తాలో బుధవారం విడుదల చేశారు. ఈ నెల 25న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 5:30 గంటలకు జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా నాయకుడు బాబయ్య మాట్లాడుతూ.. దళిత, బహుజన మేధావులు, సంఘం సభ్యులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కంచె ఐలయ్య, సింహాద్రి, మాజీ సీఎస్ కాకి మాధవరావు హాజరవుతారన్నారు. సంఘం ప్రతినిధులు నర్సింలు, అల్లం దేవసంజీవ్, సల్ల రాజు, నామపురం సురేష్, ప్రవీణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న దళిత సంఘాల నాయకులు



ప్రధానోపాధ్యాయుడికి వినతి పత్రాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయులు

పాతపింఛన్ విధానాన్ని అమలు చేయాలి

చిన్నమల్లారెడ్డి(కామారెడ్డి గ్రామీణం),న్యూస్‌టుడే: పాతపింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండు చేస్తూ చిన్నమల్లారెడ్డి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సెప్టెంబరు 1న సాముహిక సెలవు కోరుతూ వినతి పత్రాన్ని ప్రధానోపాధ్యాయుడు మాణిక్యంకు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ... సెప్టెంబరు 1 ప్రవేశ పెట్టిన సీపీఎస్ విధానంతో ఉద్యోగ, ఉపాధ్యాయులకు సామాజిక భద్రత కరవైందన్నారు. దీనిని నిరసిస్తూ సాముహిక సెలవుతో ప్రభుత్వానికి తమ ఆకాంక్షను తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభాష్, శివకుమార్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకొని నిరసన

కామారెడ్డి గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్లకు గంతలు కట్టుకొని సెర్ఫ్ ఉద్యోగులు బుధవారం కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఉద్యోగుల సమ్మె 8వ రోజుకు చేరుకుంది. ఐకాస కన్వీనర్ జగన్నాథం, బహుజన ఐక్యవేదిక కన్వీనర్ క్యాతం సిద్ధిరాములు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అగ్గి రవీందర్ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సెర్ఫ్ ఉద్యోగుల సమస్యలు ప్రజాస్వామ్యయుతమైనవని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ప్రతినిధులు అన్నపూర్ణ, దశరథ్, రాజు, రవి, సంతోష్‌రెడ్డి, మాధవి, బాల్‌చంద్రం, రాజారాం, బాబు, లత, అనిల పాల్గొన్నారు.

విగ్రహాల ఆవిష్కరణను జయప్రదం చేయండి

నందిపేట్: ఈ నెల 28న నందిపేట్ మండలం వెల్మల్ గ్రామంలో నిర్వహించనున్న అంబేడ్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షులు కలిగోట్ సంతోష్ కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను బుధవారం నందిపేట్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విగ్రహాల ఆవిష్కరణకు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణమాదిగ హాజరవుతారని, ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

ఎంఆర్ టీకా తీరును పరిశీలించిన అంతర్జాతీయ పరిశీలకుడు

డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో కొనసాగుతున్న తట్టు, రుబెల్లా టీకా తీరును పర్యవేక్షించేందుకు బుధవారం ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) నుంచి వచ్చిన అంతర్జాతీయ పరిశీలకుడు డాక్టర్ అలెన్‌సీ నిజామాబాద్ డివిజన్‌లో పర్యటించారు. పలు గ్రామాల్లో పర్యటించిన అనంతరం సాయంత్రం డిచ్‌పల్లి మండలంలో కొనసాగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన్ను పోలీసు క్యాంపు వద్ద గల విద్యా పాఠశాలలో సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీశైలం, డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారం, ఇందల్‌వాయి వైద్యులు శుభాకర్, సులోచన, శ్రీనివాస్, బేగ్ తదితరులు పాల్గొన్నారు.


డబ్ల్యూహెచ్‌వోకు చెందిన పరిశీలకుడు డాక్టర్ అలెన్‌సీని సన్మానించిన స్థానిక నాయకులు

వర్సిటీలో రాజనీతిశాస్త్రం కోర్సు పెట్టాలి

తెవివి క్యాంపస్(డిచ్‌పల్లి), న్యూస్‌టుడే: తెలంగాణ విశ్వవిద్యాలయంలో రాజనీతిశాస్త్రం కోర్సు ప్రవేశపెట్టాలని బుధవారం రిజిస్ట్రార్ విద్యావర్ధిణికి కామారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు విఠల్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. వర్సిటీలో 26 కోర్సులు నడుస్తున్నా ప్రధానమైన రాజనీతిశాస్త్రం లేకపోవడంతో విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని విన్నవించారు. అనంతరం ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ గౌరవాధ్యక్షురాలు వసుంధర, అధ్యాపకులు చంద్రశేఖర్, తిరుపతి, రవి, బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.


రిజిస్ట్రార్ విద్యావర్ధిణిని సన్మానించి వినతిపత్రం ఇస్తున్న అధ్యాపకులు

అక్రమ కలప పర్యావరణానికి కలత


గొడ్డలి వేటుకు గురైన విలువైన టేకు దుంగలు(దాచిన చిత్రం)

జిల్లాలో జోరుగా అక్రమ కలప రవాణా ● బీడుగా మారుతున్న దట్టమైన అడవులు ● అలసత్వంలో అటవీశాఖ అధికారులు

– న్యూస్‌టుడే, సిరికొండ

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా హరితహారం చేపట్టి రాష్ట్రాన్ని హరిత తెలంగాణ మార్చాలనే లక్ష్యంతో రూ.కోట్లు వెచించి ఉద్యమంలా మొక్కలు నాటుతుంటే.. మరో పక్క విలువైన అటవీ వృక్షాలు స్మగ్లర్ల గొడ్డలివేటుకు నేలకొరుగుతున్నాయి. హరితహారానికి సంబంధించి అత్యంత ఆర్భాటంగా ప్రచారం చేస్తూ ఉరుకులు, పరుగులు పెడుతున్న జిల్లా అటవీశాఖ సహజ సిద్ధమైన అడవుల రక్షణలో మాత్రం నిర్లక్ష్యం చూపడం అనుమానాలకు తావిస్తోంది. విలువైన టేకు కలప స్మగ్లర్ల ద్వారా యథేచ్ఛగా తరలిపోతున్నా కంటితుడుపు చర్యలు మినహా నివారణకు పకడ్బందీగా వ్యవహరించడం లేదు. ఫలితంగా ఒకప్పుడు పచ్చని బయళ్లు, జంతువులతో కళకళలాడే అడవులు నేడు బీడు భూములుగా మారుతున్నాయి. జిల్లాలోని ఐదు రేంజిల పరిధిలో అక్రమ కలప వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా కొనసాగుతోంది.


ద్విచక్రవాహనంపై తరలిస్తున్న టేకు దుంగలు(దాచిన చిత్రం)

సంవత్సరం	ఓఆర్ కేసులు	యూడీఆర్ కేసులు	పట్టుబడిన కలప విలువ(రూ)	విధించిన జరిమానా(రూ.)	పట్టుబడిన వాహనాలు
2011-12	498	38	12,80,049	25,96,106	45
2012-13	491	28	12,09,436	26,45,811	44
2013-14	383	34	22,10,344	32,73,008	82
2014-15	305	23	86,45,12	26,02,436	44
2015-16	323	29	9,72,682	22,33,360	43
2016-17	304	34	8,98,512	23,44,360	46

ఏటా పెరుగుతున్న కేసులు

జిల్లాలో అటవీ విస్తీర్ణం 85,911. 95 హెక్టార్లు ఉంది. ఐదు రేంజిల పరిధిలో కలప విచ్చలవిడిగా అక్రమ రవాణా అవుతోందనడానికి ఈ గణాంకాలే సాక్షంగా నిలుస్తున్నాయి.

వాల్టా చట్టానికి తూట్లు

పర్యావరణ పరిరక్షణ కోసం తెచ్చిన వాల్టా చట్టం పచ్చని చెట్లను నరకొద్దని స్పష్టంగా చెబుతుంది. కానీ రైతుల పంట పొలాల గట్లపైన, ప్రభుత్వ భూముల్లో, ఉన్న టేకు వేప, తుమ్మ, నీలగిరి, చింత, మామిడి చెట్లను అటవీశాఖ అధికారుల అనుమతి లేకుండానే నరికి వేస్తున్నా పట్టించుకునే నాథుడే లేరు. కొందరు విలువైన కలపను సామిల్స్‌కు పంపించి వ్యాపారం చేస్తున్నారు. ట్రాక్టర్లు, కార్లు, ద్విచక్రవాహనాలపై స్మగ్లర్లు జోరుగా తరలిస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో అటవీ ప్రాంతాలు గొడ్డలి వేటుకు బలవుతున్నా అటవీశాఖ అధికారులు మాత్రం తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. కాగా వారి కనుసైగల్లోనే ఈ దందా జరుగుతోందన్న ఆరోపణలూ ఉన్నాయి.

గొడ్డలి వేటుకు గురవుతున్న ప్రాంతాలు

◆ నిజామాబాద్ జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో గల మల్లారం అటవీ ప్రాంతం నుంచి అక్రమ కలప రవాణా జోరుగా సాగుతోంది.

◆ భీమ్‌గల్ మండలంలోని సికింద్రాపూర్, పిప్రి, బాచన్‌పల్లి అటవీప్రాంతాలు అక్రమ రవాణాతో ఎడారులుగా మారుతున్నాయి.

◆ సిరికొండ మండలంలోని తూంపల్లి, పాకాల, న్యావనంది, రావుట్ల, పందిమడుగు అటవీప్రాంతం నుంచి విలువైన టేకు కలప అక్రమ రవాణా జరుగుతోంది. ◆ భీమ్‌గల్ మండలంలోని మానాల, దాని పరిధిలోని 16 తండాల నుంచి మండల కేంద్రంలోని సామిళ్లకు కలప రవాణా జరుగుతోంది.

◆ వర్ని మండలంలోని బడాపహాడ్ అక్రమ కలపకు అడ్డాగా మారింది.

◆ ధర్పల్లి మండలంలోని చల్లగరిగే, దుబ్బాక, గౌరారం గ్రామాలు.

◆ డిచ్‌పల్లి మండలంలోని కొరట్‌పల్లితండా, మైలారం, పడకల్ నుంచి..

◆ బాల్కొండ మండలంలోని రెంజర్ల బీట్ పరిధిలో రవాణా కొనసాగుతోంది.

కన్న తండ్రే కాటేశాడు

● కూతురిపై అఘాయిత్యం

జుక్కల్, న్యూస్‌టుడే: కంచే చేను మేసింది.. కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే అఘాయిత్యానికి పాల్పడ్డాడు. తండ్రి కామానికి బలైన కుమార్తె గర్భం దాల్చింది. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలోని ఓ గ్రామంలో చోటుచేసుకొన్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం..మండలంలో ఓ గ్రామానికి చెందిన వ్యక్తికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. రెండో కుమార్తె తొమ్మిదోతరగతి చదువుతోంది. ఆ బాలిక 20 రోజుల క్రితం కడుపు నొప్పితో బాధపడుతుంటే ఉపాధ్యాయులు వైద్యపరీక్షలు నిర్వహించారు. గర్భందాల్చినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకొని సోదరి ఇక్కడకు వచ్చారు. కారణం ఎవరనేది తెలియకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. కేసును తీవ్రంగా పరిగణించి రహస్యంగా విచారణ చేపట్టారు. 15 రోజుల పాటు విచారణ కొనసాగింది..చివరికి ఆ బాలిక తండ్రే కారణమని తేలడంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై జుక్కల్ ఎస్సై రవికుమార్‌ను వివరణ కోరగా... తాను గణపతి బందోబస్తు హైదరాబాద్‌కు వచ్చానని, ఏఎస్సైని వివరాలు కోరాలని సూచించారు. ఏఎస్సై తనకేం తెలియదని చెప్పారు.

ఉపాధ్యాయ దినోత్సవంపై వ్యాసరచన పోటీ

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల, కళాశాల విద్యార్థులకు 'నా దృష్టిలో ఉత్తమ ఉపాధ్యాయుడు' అంశంపై జిల్లాస్థాయి వ్యాసరచన పోటీని నిర్వహిస్తున్నట్లు తెలుగు వెలుగు సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, తదితర భాషల్లో వ్యాసాలను రాయవచ్చన్నారు. సెప్టెంబరు 3లోగా ప్రధాన కార్యదర్శి, 10-14-1766, సీతారాంనగర్‌కాలనీ, నిజామాబాద్ అనే చిరునామాకు తమ వ్యాసాలను పంపించాలన్నారు. విజేతలకు వచ్చే నెల 5న జరిగే కార్యక్రమంలో బహుమతులను అందజేస్తామన్నారు.

అయిదు దేవాలయాలకు పాలక మండళ్ల నియామకం

● నేడు శంభునిగుడి మండలి ప్రమాణస్వీకారం

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: దేవాదాయశాఖ పరిధిలోని నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన దేవాలయాల నూతన పాలకమండళ్ల నియామక ప్రక్రియను చేపట్టారు. అయిదు ఆలయాలకు రాష్ట్రశాఖ అధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి. చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, మాచారెడ్డి సత్యనారాయణ మందిరం నీలకంఠేశ్వరాలయం, శంభునిగుడి, జెండాబాలాజీ ఆలయాలున్నాయి. ఇందులో చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి మందిరం పాలక మండలి ప్రమాణం చేసింది. గురువారం శంభునిగుడి పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దేవాదాయశాఖ ఉమ్మడి జిల్లాల సహాయ కమిషనర్ సోమయ్య 'న్యూస్‌టుడే'తో తెలిపారు. ఇదివరకే 16 ఆలయాలకు ధర్మకర్త మండళ్లను నియమించామన్నారు. మిగిలిన మాధవనగర్ సాయిబాబా ఆలయం, బోధన్ శివమందిరం, ఖుదావన్‌పూర్ ఎల్లమ్మ ఆలయాలకు పాలక మండలిని త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చదువు గట్టెక్కాలని...



రెంజల్, న్యూస్‌టుడే: గుత్తేదారు నిర్లక్ష్యం వారికి శాపంగా మారింది. రెంజల్ శివారులోని రెంజల్-బోధన్ రహదారిపై రూ.2.70 కోట్ల వ్యయంతో వాగుపై చేపడుతున్న వంతెన పనులు అసంపూర్తిగా మిగలగా, ఇటీవల కురిసిన వర్షాలకు తాత్కాలికంగా వాగుపై వేసిన రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో గత ఆరు రోజులుగా రాకపోకలు నిలిచిపోయినా ర.భ.శాఖ అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడలేదు. రెంజల్ మండల కేంద్రం నుంచి రోజూ బోధన్‌లో చదువుకునేందుకు వందలాది మంది విద్యార్థులు వెళ్తుంటారు. బోధన్ నుంచి వచ్చే బస్సు ఈ వాగు వరకే వచ్చి వెనక్కి వెళ్తుండటంతో వారికి వాగు దాటడం సాహసంగా మారింది. వాగులో నీరు అధికంగా పారుతుండడంతో అసంపూర్తిగా ఉన్న వంతెనను దాటడం ప్రమాదమని తెలిసినా బండరాళ్ల మీదుగా వంతెనపైకి ఎక్కి అవతలికి చేరుకుంటున్నారు. మరోపక్కన ఇతర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఈ వంతెన దాటేందుకు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. బుధవారం ఈ విధంగా వంతెనపైకి ఎక్కి అవతలి భాగానికి చేరుకుంటున్న దృశ్యాలను 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. అధికారులు ఇకనైనా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.





Junior Inter
STUDY PLAN
CHEMISTRY

A top ranker says that clear cut strategy, clarity of concepts, memorising the formulae and focussed preparation are essential for grand success. Systematic planning helps to get good score in competitive exams. By doing so one can reach the goal easily.

ప్రతిభ

The 'brain of chemistry' is..


Writer:
A.N.S. Sankara Rao
Subject Expert

Read Chemistry regularly early in the morning in order to retain chemistry for ever. Identify most repeated VSAQs (2 Marks), SAQs (4 Marks), LAQs (8 Marks) from previous I.P.E. papers. It is comfortable to answer in LAQs, SAQs and VSAQs order for 100% score in B.I.E. Most of the times some of the VSAQs are not repeated from few lessons, so one must learn all VSAQs given at chapter end, intext, inbox and solved questions.

For Very Short Answer Questions

(SAQs - 2 Marks)

Put more efforts on States of matter, Stoichiometry, Thermodynamics, Chemical equilibrium & Acids-bases, Alkali & Alkaline earth metals, Group 13 & 14 elements, Environmental Chemistry and Organic Chemistry.

For Short Answer Questions

(SAQs - 4 Marks)

Learn questions from States of matter, Stoichiometry, Thermodynamics, Chemical equilibrium and Acids - Bases, H_2 & Its compounds, 13th & 14th groups, Chemical bonding and Organic Chemistry.

For Long Answer Questions

(LAQs - 8 Marks)

3 LAQs are coming only from Atomic Structure, Classification of elements, Chemical bonding and Organic Chemistry.

Atomic Structure

(8 Marks)

★ **For I.P.E.:** LAQs 1) 4 Quantum numbers 2) Postulates, limitations of Bohr's model of H atom, line spectrum of H atom.

★ **For competitive exams:** Rydberg's equation, work function, K.E., P.E., T.E., de Broglie, Heisenberg's uncertainty principle related problems and concepts. Quantum numbers, shapes of orbitals, quantum mechanical model, radial nodes and angular nodes.

Classification of Elements And Periodicity in Properties

(8 Marks)

★ **For I.P.E:** LAQs 1) $I.E._1$ & $I.E_2$, Comparison, Factors effecting 2) s, p, d, f block elements 3) Periodic property def. & their variation in group & period- I.E, E.N., E.G.E., atomic radius, nature of oxides.

★ **For competitive exams:** Criss - Cross rule, position of elements, valency, types of radii, iso electronic and all the periodic properties (exceptions trends in groups, periods and both).

Chemical Bonding And Molecular Structure

(4 + 4 or 8 Marks)

We can consider this lesson as back bone of entire chemistry. Clarity of each & every concept is very important for all types of exams.

★ **For I.P.E:** LAQs 1) Hybridisation (def. & sp, sp^2, sp^3 types) 2) MOED of O_2 & N_2– their bond order & magnetic nature.

SAQs: 1) Hybridisation of PCl_5 & SF_6
2) Hydrogen bond, types
3) Dipole moment def., applications
4) Dative bond def., examples



5) Postulates of VSEPR theory.

★ **For competitive exams:** Complete MOT, VSEPR Theory, formal charge, hybridisation, Hydrogen bond, Fajan's rules, dipole moment, no. of lone pairs - bond pairs and bond parameters.

States of Matter : Gases and Liquids

(2 + 4 Marks)

★ **For I.P.E.:** SAQs: 1) Postulates of Kinetic molecular theory of gases 2) Deduction of gas laws: Avogadro, Boyle, Charle's, Dalton, K.E, Graham's law 3) Derivation of ideal gas equation 4) Graham's law (def. & problem) 5) Dalton's law (def. & problem) 6) 3 types of speeds (def. & problem) and solved problems 4.4 to 4.6.

★ **VSAQs:** 4, 10, 15, 18, 19, 22, 32 to 35, 42, 43, 45 and 4.7 to 4.10

★ **For competitive exams:** Vander Waal's equation, K.E., problems on 3 types of speeds, Graham's Law, Dalton's law and concepts of viscosity, Surface tension.

Stoichiometry

(2 + 4 Marks)

Stoichiometry is heart of chemistry. Art of learning physical chemistry lessons and some of the Inorganic chemistry lessons are well linked with this lesson.

★ **For I.P.E:** SAQs: 1) Balancing of redox reactions in acid medium & basic medium 2) E.F. & M.F. related problems.

★ **VSAQs:** 1, 3, 5 to 8, problems on w-w, w-v, v-v and equivalent weights solved problems: 5.1, 5.2, 5.4, 5.6 to 5.9, 5.14 law of definite proportions, law of multiple proportions.

★ **For competitive exams:** Significant figures, accuracy, precise, oxidation numbers, M, N, m, x, Eq. Wts, E.F., M.F., oxidising and reducing agents, mole concept, stoichiometric calculations.

Thermodynamics

(4 or 2 + 2 marks)

★ **For I.P.E.:** SAQs: 1) Hess's law 2) $C_P - C_V = R$ 3) Problems on types of Enthalpies.

★ **VSAQs:** 2, 14, 22, 25, 29, 32, 37 and intext questions 6.3, 6.4, 6.11, 6.12

★ **For competitive exams:** State function, path function, 1st, 2nd, 3rd laws of thermodynamics, entropy, enthalpy of formation, combustion, H, E, G related problems, criteria of spontaneity (ΔG, ΔH, ΔS linked), extensive and intensive properties.

Chemical Equilibrium & Acids - Bases

(2 + 4 Marks)

★ **For I.P.E:** SAQs: 1) Lechatlier's principle (def. & synthesis of SO_3 & NH_3) 2) K_C, K_P relation for SO_3, NH_3 equilibria 3) Lewis theory 4) Buffer solutions (def, types, examples, buffer action, problems) 5) Salt Hydrolysis def. & nature of 3 types of salt solutions 6) Solubility - Solubility product - common ion effect and intext questions 7.14, 7.15, 7.17, 7.25 to 7.28.

★ **VSAQs:** 1, 4, 5, 7, 11, 12, 13, 24, 26, 30, 31, 69. Intext Questions: 7.2, 7.5, 7.7, 7.11, 7.14, 7.15, 7.17, 7.25 to 7.28.

★ **For competitive exams:** Q_C & K_C, K_C & K_P relation, problems on pH, K_w, K_a, K_b, K_c, Ksp, buffer solutions and salt hydrolysis of different salts.

Hydrogen & Its Compounds

(4 Marks)

★ **For IPE:** SAQs: 1) Utility of H_2 as fuel 2) Temporary & Permanent hardness of water calgon (or ion exchange method). 3) All types of hydrides 4) Oxidising and reducing properties of H_2O_2. 5) Preparation of H_2O_2 by auto oxidation method & electrolytic method.

★ **VSAQs:** There is a possibility of asking two 2 marks questions like What is syn gas/ Coal gasification/ Auto protolysis/ Uses of D_2O/ M.P., B.P. of D_2O/ 3 isotopes of H/ Use of H_2 in welding of high melting metals/ Water is amphoteric in Bronsted sense/ Why B.P. of H_2O is greater than H_2S?

★ Chapter end questions: 1, 2, 4, 5, 9, 10, 11, 15, 16, 19, 33.

★ **For competitive Exams:** Types of hydrides, problems on H_2O_2 & Hardness of water. Comparison of physical properties of H_2 & D_2, H_2O & D_2O, Calgon & ion exchange methods.

Alkali & Alkaline Earth Metals

(2 + 2 Marks)

★ **For IPE:** VSAQs: Biological importance of Ca^{+2}, Mg^{+2}, Na^+, K^+, Lesson end questions: 3, 4, 5, 6, 11, 12, 14 to 28, 33, 34, 36, 37, 42, 43. Why is KO_2 is paramagnetic? What is the Oxi. state of K in KO_2?

★ **For competitive exams:** Order of hydrated ions size, order of density, SRPs, reducing strength, solubility, lattice enthalpies of IA metals, Na-K pump, IA, IIA metal solutions in NH_3 (liq.), Uses of Cu-Be, Mg-Al alloys, Mg CO_3. It is advisable to make notes of key points & trends of periodic properties (especially anamalous properties) of 1st to 18th groups.

Group -13 Elements

(2 + 2 or 4 Marks)

★ **For I.P.E.:** SAQs: 1) Borax bead test 2) Structure of Diborane 3) Preparation & Chemical Properties of B_2H_6.

★ **VSAQs:** 1) Formula of borazine & Its common name. 2) Inert pair effect def. Stability of Tl^{+1} Salts. 3) Hybridisation of B in Borazine & Diaborane.

4. Structure of Borazole & Orthoboric acid.

★ **For competitive exams:** Physical properties, Inert pair effect, structural aspects of diborane, borax, boric acid, chemical properties of diborane, borax bead test, in text, inbox questions.

Group - 14 Elements

(2 + 2 or 4 Marks)

★ **For I.P.E:** SAQs: 1) Difference in properties of diamond and graphite 2) Write a short note on allotropy, catenation, inert pair effect, green house effect.

★ **VSAQs:** 1 to 31, 34d, 41, 42, 43c, 44, 45a, b, 48, 50 a, b, c, uses of Zeolites, silicones, what are fullerenes? CCl_4 doesn't dissolve in water but $SiCl_4$ dissolves. Why?

★ **For competitive exams:** Inert pair effect, uses & structures of Silicates, Silicones, Zeolites, pH of $H_2CO_3/H_2CO_3^-$ system, structure of fullerene, Types of Oxides, hydrolysis of compounds.

Environmental Chemistry

(2 + 2 Marks)

★ **For I.P.E.:** VSAQs: Sink, receptor, BOD, COD, pollutant, contaminant, TLV, Eutrophication, BOD values of clean and polluted water, DO (def. values of cold water & air), green house effect, acid rains (def., gases, causes, ill effects), chapter end questions 23, 29, 1, 2, 6, 15, 17.

★ For competitive exams: All key points.

Organic Chemistry

(2 + 4 + 4 or 2 + 8 = 10 Marks)

Organic chemistry is the 'brain of chemistry' as it is well connected to fundamentals of other lessons like chemical bonding. Highest weightage is given to this lesson. Once the logic of this lesson is known, one can score good marks in all types of exams. It is very essential to learn all the basics, concepts & their applications to score good marks in EAMCET, NEET, BITSAT, JEE Mains & Advanced like exams.

★ **For I.P.E.:** LAQs: 2 preparations & all chemical properties of C_2H_2, C_2H_4, C_6H_6

★ **SAQs:** 11 to 17, 32, 37, 39, 42, 43, 49, 57 and 59.

★ **VSAQs:** Isomers of C_3H_6O, What is polymerization? IUPAC Nomenclature (names & structures), chapter end questions: 1 to 8, 27 and solved problems 13.1 to 13.12, 13.19, 13.20 to 13.25, 13.30, 13.34, 13.36, 13.38.

★ **For competitive exams:** Identification of prefix, root word, primary & secondary suffix in organic compounds make IUPAC nomenclature easier. All named reactions, qualitative & quantitative analysis calculations, reactions, types of isomerism, conformers of ethane, electron displacement reactions, directional influence of functional groups in monosubstituted benzene, reaction mechanisms, conversions, bond parameters several revisions are required to retain Organic chemistry in mind.

జనరల్ స్టడీస్

ఎకానమీ

ప్రతిభ

భారత ప్రజాస్వామ్య ప్రస్థానంలో అతిపెద్ద పరోక్ష పన్ను సంస్కరణగా ఆవిర్భవించిన వస్తు-సేవల పన్ను (జీఎస్టీ) 2017 జులై 1 నుంచి అమల్లోకి వచ్చింది. దేశ మార్కెట్లను ఏకీకృతం చేసేలా ఒకే పన్ను విధానం రావడం వల్ల వస్తువులు ఎక్కడైనా ఒకే ధరకు లభించడమే కాకుండా, దాదాపు 17 పరోక్ష పన్నులు ఇప్పుడు ఒకే పన్నుగా అవతరించాయి. 'గుడ్ అండ్ సింపుల్ టాక్స్'గా ప్రధాని నరేంద్ర మోదీ దీన్ని అభివర్ణించారు.

జీఎస్టీని మొదట అమల్లోకి తెచ్చిన దేశం?



రచయిత
- దాడి నారాయణరావు
అసిస్టెంట్ ప్రొఫెసర్

జీఎస్టీ పరిణామక్రమం

జీఎస్టీ ఆలోచన 1986-87 లోనే మన దేశంలో మొగ్గ తొడిగింది. గత పదిహేడేళ్లలో సుదీర్ఘ కసరత్తు జరిగి 2017 లో అమల్లోకి వచ్చింది. 2000 లో నాటి ఎన్డీయే సర్కారు హయంలో ఏర్పాటుచేసిన ఆర్థిక సలహా కమిటీ సూచనల మేరకు అసిమ్‌దాస్ గుప్తా నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత పన్ను సంస్కరణలను వేగవంతం చేసే లక్ష్యంతో 2003 లో విజయ్ కేల్కర్ నేతృత్వంలోని కమిటీ 12 వ ఆర్థిక సంఘం సూచించినట్లుగానే జీఎస్టీని తీసుకురావాలని 2005 లో సిఫారసు చేసింది. జీఎస్టీని 2010 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తెస్తామని నాటి యూపీఏ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అది అమలుకు నోచుకోలేదు. ఆ తర్వాత 2011 లో యూపీఏ ప్రభుత్వం లోక్‌సభలో రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టింది. జీఎస్టీ కమిటీ ఛైర్మన్ పదవి నుంచి అసిమ్‌దాస్ గుప్తా తప్పుకోవడంతో కె.ఎం. మణికి ఆ బాధ్యతలు అప్పగించారు. ఇలా చాలారోజులు ఈ బిల్లు రాజకీయాల మధ్య నలిగిపోయింది. చివరికి 2015 లో లోక్‌సభలో, 2016 లో రాజ్యసభలో ఆమోదం పొంది 2017 జులై 1 నుంచి అమల్లోకి వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా 160 కి పైగా దేశాల్లో అమల్లో వున్న జీఎస్టీని 1954 లో ఫ్రాన్స్ తొలిసారిగా అమల్లోకి తీసుకొచ్చింది. మన దేశంలో జీఎస్టీ మండలి 18 సార్లు సమావేశమైంది.

జీఎస్టీ అంటే...

పన్నెండేళ్ల కిందట అమల్లోకి వచ్చిన వ్యాట్ (VAT) లో ఎన్నో లోపాలు, లొసుగులు ఉండటం, వివిధ రాష్ట్రాల్లో, వివిధ రకాల పన్నులు, పన్ను రేట్లు ఉండటంతో ఒక సమగ్ర పన్ను విధానాన్ని రూపొందించాల్సి వచ్చింది. సేల్స్‌టాక్స్, సర్వీస్‌టాక్స్, సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ, ఎంట్రీ టాక్స్, పర్చేజ్ టాక్స్ అనే రకరకాల పన్నుల స్థానంలో 'ఒకే పన్ను'గా అమల్లోకి వచ్చిందే జీఎస్టీ. దీనివల్ల దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం అమలవుతుంది. దేశంలో ఇప్పుడు ప్రతి వస్తువుకీ ఎక్కడైనా ఒకే శ్లాబులో పన్ను పడుతుంది. అయితే వివిధ రకాల వస్తువులు, సేవల వర్గీకరణను బట్టి వాటిపై విధించే పన్నుల శ్లాబులు దేశమంతా 0, 5, 12, 18, 28 శాతాలుగా విధిస్తారు. జీఎస్టీ పూర్తి స్వరూపాన్ని తెలుసుకుంటే అది మంచో చెడో, లాభమో, నష్టమో మనం అర్థం చేసుకోవచ్చు.

జీఎస్టీ ప్రభావం... అంచనా

సాధారణ పౌరుడి మీద ఈ కొత్త పన్ను ప్రభావం ఎలా ఉండబోతోంది? అసలు సామాన్యుడికి అంతిమంగా ఒరిగేదేంటన్న ప్రశ్న చిక్కుముడిలాగే మిగిలిపోయినా వినియోగదారుడే రాజు అనే జీఎస్టీ మౌలిక స్ఫూర్తి సాకారం కావడానికి, దాని ప్రతిఫలాలు పొందడానికి కొంతకాలం వేచిచూడక తప్పదు. ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలోని జీఎస్టీ మండలి ముందుముందు మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. సామాన్యులు రోజువారీ ఉపయోగించే వస్తువుల్లో 81% సున్నా నుంచి 18% లోపు పన్ను పరిధిలోకి వచ్చాయి. తద్వారా సంస్థలు పన్ను ప్రయోజనాలను వినియోగదారులకు అందిస్తున్నాయో లేదో చూడటానికి 'యాంటీ ప్రాఫిటీరింగ్' కమిటీ పనిచేస్తుంది. ఈ కమిటీకి ధరలు తగ్గించని సంస్థల లైసెన్స్‌ను రద్దు చేసే హక్కు ఉంటుంది.

అలాగే సంస్థలకు 'ఇన్‌పుట్ క్రెడిట్' వల్ల ఉత్పత్తి వ్యయం తగ్గుతుంది. వ్యాట్‌లో వివిధ దశల్లో విధించే పన్ను స్థానంలో జీఎస్టీ రావడం వల్ల ఒకే పన్ను విధానం అమలవుతోంది. దీంతో లభించే ఇన్‌పుట్ క్రెడిట్ పన్ను చెల్లింపులను ప్రోత్సహిస్తుంది. ఉదాహరణకు, ఒక వ్యాపారి దగ్గర 1000 రూపాయలకి ఒక వస్తువును కొని, దాన్ని 1500 కి తిరిగి అమ్మితే, రెండో వ్యాపారి పై 500 రూపాయలకు పన్నుకడితే సరిపోతుంది. మొదటి 1000 రూపాయలకు మొదటి వ్యాపారే పన్నుకట్టాడు కాబట్టి, రెండో వ్యాపారికి ఇన్‌పుట్ క్రెడిట్ లభ్యమవుతుంది. ఇది సంస్థలకు పన్ను భారాన్ని తగ్గిస్తుంది.

అలాగే ఒక వస్తువు ఏ ప్రాంతంలో తయారైనా, అది చివరిగా ఏ ప్రాంతంలో వినియోగమవుతుందో, ఆ ప్రాంత రాష్ట్రానికే దాని తాలూకు పన్ను దక్కుతుంది. తత్ఫలితంగా ఎక్కువ కొనుగోలు శక్తి ఉన్న రాష్ట్రాలకు పన్నుల ఆదాయం ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. అలాగే గతంలో వేర్వేరు రాష్ట్రాల మధ్య సరకు రవాణా పన్నులు ఎక్కువగా ఉండటంతో చిన్న రాష్ట్రాలు వెనకడుగు వేసేవి. ఇప్పుడు వెనకబడిన రాష్ట్రాలు తమ ఉత్పత్తులను దేశవ్యాప్తంగా రవాణా చేయగలుగుతాయి. దేశంలో ఎగువ మధ్యతరగతి ప్రజలు, సంపన్నులపైనా, చిన్న వ్యాపారులపైనా, ప్రముఖ బహుళజాతి సంస్థలపైనా జీఎస్టీ భారంగానే ఉందనవచ్చు. ఎంట్రీటాక్స్ రద్దుతో చెక్‌పోస్టుల్లో అవినీతికి అడ్డుకట్ట పడుతుందని చెప్పవచ్చు. ప్రతి వ్యాపారి, సంస్థ పన్ను రిటర్నుల నిర్వహణంతా పూర్తిగా ఆన్‌లైన్‌లోనే చేయాలనే నిబంధన ఉండటంతో దీనిలో నమోదు చేసుకున్న ఏ వ్యాపారీ పన్నుల నుంచి తప్పించుకోలేడు. కాబట్టి వ్యవస్థలో నల్ల ధనం ఎంతో కొంత తగ్గే అవకాశం ఉంది. అలాగే పన్ను చెల్లింపుదార్లకు జీఎస్టీ బిల్లు రాయితీలు, ప్రయోజనాలు కల్పిస్తుండటంతో సంస్థలు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకునేందుకు సన్నద్ధత వ్యక్తం చేస్తాయి. జీఎస్టీ పరిధిలోకి వచ్చే ప్రతి వ్యాపారికీ జీఎస్టీ కంప్లయిన్స్ రేటింగ్ లభిస్తుంది. సంస్థలు ఈ రేటింగ్ పెంచుకునే క్రమంలో సమర్థంగా పనిచేస్తాయి. మన జీడీపీలో పన్నుల వాటా పెరుగుతుంది. ఇతర దేశాలతో పోలిస్తే ప్రస్తుత మన జీఎస్టీ రేట్లు ఎక్కువగా ఉన్నప్పటికీ రాబోయే కాలంలో పన్నుల ఆదాయం, పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరగడం వల్ల పన్నురేట్లు తగ్గే అవకాశం ఉంది. ఈ చారిత్రాత్మక పన్ను వల్ల సామాన్యులు కొన్ని లాభాలను అందుకోవడమే కాదు, కొన్ని త్యాగాలకు సిద్ధపడకా తప్పదు. కొన్ని వస్తువులపై పన్ను భారం తగ్గినట్లు కనిపించినా సేవా పన్నుల రూపంలో తిరిగి రాబట్టుకోవడం జీఎస్టీ ప్రత్యేకత.

జీఎస్టీ స్వరూపం - అమలు

వస్తువు తయారీ నుంచి వినియోగదారుడికి చేరేవరకూ వివిధ దశల్లో అదనపు విలువపై పన్నుభారం పడటం జీఎస్టీ ప్రత్యేకత. సరఫరాదారుడు లేదా వినియోగదారుడు ఉన్న ప్రదేశంలో పన్ను వసూలుచేసే 'గమ్యం ఆధారిత' పన్ను దీనిలో భాగం. జీఎస్టీ మండలి సిఫారసు మేరకు కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు జీఎస్టీ రేట్లను ప్రకటిస్తాయి. అంటే ఒక వస్తువు లేదా సేవపై పన్ను తగ్గించాలన్నా పెంచాలన్నా అది జీఎస్టీ కౌన్సిల్‌కే సాధ్యం. ఈ మండలిలో కేంద్ర ఆర్థికమంత్రి ఛైర్మన్‌గా, రాష్ట్రాల ఆర్థిక మంత్రులు సభ్యులుగా ఉంటారు. 0, 5, 12, 18, 28 శాతం పన్నురేట్లతో పాటు, బంగారం, బంగారు ఆభరణాలపై 3% ప్రత్యేక జీఎస్టీని ప్రతిపాదించారు. కొన్ని వస్తువులపై ప్రత్యేక సెస్సులు విధించి ఇలా వసూలైన ఆదాయాన్ని జీఎస్టీ అమలుతో ఆదాయాన్ని కోల్పోతున్న రాష్ట్రాలకు నష్టాన్ని భర్తీ చేయటానికి కేటాయిస్తారు. ద్వంద్వ జీఎస్టీ విధానాన్ని, సమీకృత జీఎస్టీ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ సదుపాయంతో పన్నుపై పన్ను లేకపోవడం వల్ల పన్నుల పరిధి విస్తృతమై, ధరలు తగ్గి, పన్ను ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది. జీఎస్టీతో రాష్ట్రాల పన్ను రాబడి తగ్గితే, దాన్ని వచ్చే అయిదేళ్లపాటు కేంద్ర ప్రభుత్వం భర్తీ చేస్తుంది. జీఎస్టీ అమలుకు 'జీఎస్టీ నెట్‌వర్క్' (GSTN) పేరుతో లాభాపేక్షలేని ఒక సంస్థను ఏర్పాటు చేశారు. ప్రభుత్వానికి - వ్యాపారులకు మధ్య, కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జీఎస్టీ అమలు విషయంలో ఏదైనా వివాదం తలెత్తితే దాని పరిష్కారానికి జీఎస్టీ కౌన్సిల్ ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తుంది.

రూ. 20 లక్షల కంటే అధిక వార్షిక వ్యాపారాదాయం ఉన్నవారంతా జీఎస్టీ పరిధిలోకి వస్తారు. దిగుమతులను అంతర్రాష్ట్ర లావాదేవీగా పరిగణించి IGST విధిస్తారు. ఎగుమతుల మీద జీఎస్టీ ఉండదు. సెక్యూరిటీ లావాదేవీలకు, SEZ యూనిట్లకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇచ్చారు. అలాగే మద్యం, పెట్రోలియం ఉత్పత్తులపై ప్రస్తుతం ఉన్న పన్నులనే విధిస్తారు. వీటిని జీఎస్టీ పరిధిలోకి తీసుకురాలేదు. వీటిని ఎప్పుడు తీసుకురావాలనే అంశంపై జీఎస్టీ కౌన్సిల్ భవిష్యత్తులో నిర్ణయం తీసుకుంటుంది.

రద్దయ్యే కేంద్ర పన్నులు..
కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ, అదనపు ఎక్సైజ్ డ్యూటీ, కౌంటర్ వెయిలింగ్ డ్యూటీ (CVD) ప్రత్యేక అదనపు కస్టమ్స్ డ్యూటీ, సేవాపన్ను.

రద్దయ్యే రాష్ట్ర పన్నులు..
రాష్ట్ర వ్యాట్ (VAT), కేంద్ర అమ్మకం పన్ను, విలాస సుంకం, ప్రవేశ పన్ను, వినోద పన్ను (స్థానిక సంస్థలు విధించేవి మినహా) ప్రకటనలపై పన్ను, కొనుగోలు పన్ను, లాటరీలు, పందెం, జూదంపై పన్ను.

జీఎస్టీపై అపోహలు - వివిధ రంగాలపై ప్రభావం

దేశంలో అన్ని రంగాల పురోగమనమే ధ్యేయంగా దూసుకొచ్చిన జీఎస్టీ సమాఖ్య స్ఫూర్తికి చక్కటి ఉదాహరణ. వివిధ రాష్ట్రాల మధ్య ఆరోగ్యకర పోటీకి ఆస్కారమిస్తుంది. అయితే ఏదైనా కొత్త సంస్కరణ అమల్లోకి వచ్చినప్పుడు కొన్ని రంగాలపై సానుకూల, మరికొన్నింటిపై ప్రతికూల ప్రభావం చూపించవచ్చు. మరికొన్నింటిపై ఏ విధమైన ప్రభావం ఉండకపోవచ్చు. అయితే జీఎస్టీ అమల్లో ప్రభుత్వ కృషితో పాటు పన్ను చెల్లింపుదార్లు, వ్యాపారుల సహకారం ముఖ్యం. దాదాపు 130 కోట్ల మంది జనాభా, 2.3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ ఉన్న దేశాన్ని ఏకీకృతంగా రూపుదిద్దడం సామాన్యమైన విషయం కాదు. స్వాతంత్ర్యానంతరం అమల్లోకి వచ్చిన అతిపెద్ద పరోక్ష పన్నుల సంస్కరణగా దీన్ని ప్రశంసిస్తున్నారు. అయితే జీఎస్టీ వల్ల ధరలు పెరుగుతాయనేది అపోహ మాత్రమే. నిత్యావసరాలు, ఆహార పదార్థాలపై పూర్తిగా పన్ను తొలగించారు. రాష్ట్రాలకు ఆదాయం తగ్గినా 2015-16 ఆర్థిక సంవత్సరంలో ప్రామాణికంగా వచ్చిన రాబడికి 14% అదనంగా ఇస్తారు. ఏటా ఇలా లెక్కించి లోటును భర్తీచేస్తారు. వ్యాపారులకు ఆన్‌లైన్‌లో నమోదు వల్ల పన్ను విధానం మరింత సరళీకృతమవుతుంది. రాష్ట్రాలకు పన్నుల ద్వారా వచ్చే రాబడిలో జీఎస్టీ పరిధిలోకి వచ్చేది 38 శాతం వరకు మాత్రమే ఉంటుంది. కొత్త వ్యవస్థలోకి మారడానికి కంపెనీలు ఏకకాల భారీ వ్యయాలను మోయాల్సి ఉన్నా దీర్ఘకాలంలో లాభాలే పొందుతాయి. రవాణా కంపెనీలకు అత్యధిక ప్రయోజనం ఉంటుంది. రాష్ట్రాలకు సేవా పన్నుల నుంచి అదనపు రాబడి వస్తుంది.

జీఎస్టీ వల్ల ఎఫ్ఎంసీజీ (FMCG) దీర్ఘకాలంలో ప్రయోజనం కలిగి సరఫరా మెరుగుపడి, 81 శాతం ఉత్పత్తులకు మేలు కలుగుతుంది. అయితే బ్యాంకింగ్, బీమా, టెలికాం సేవలు మరింత ప్రియం కానున్నాయి. ఆభరణాల ధరలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది. వాహన రంగంలో విలాసవంతమైన కార్లపై పన్నుభారం తగ్గే అవకాశం ఉంది. అయితే జీఎస్టీ మండలి దీనిపై సమీక్ష జరిపితే, భవిష్యత్తులో వాహన రంగ ధరల్లో స్వల్పహెచ్చు తగ్గులు సంభవించవచ్చు. ఎలక్ట్రానిక్స్ రంగంపై జీఎస్టీ ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉంది. బొగ్గుపై పన్నురేటు తగ్గడంతో సిమెంట్‌పై జీఎస్టీ ప్రభావం స్వల్పంగానే ఉంది. ఇనుము, ఉక్కు రంగాలకు కొంత సానుకూలత ఉంది.

ఇటీవల జీఎస్టీ మండలి సమావేశంలో అదనంగా 66 రకాల వస్తువులపై పన్నుపోటును జీఎస్టీ మండలి ఉపసంహరించింది. అలాగే జీఎస్టీ రాక ముందు వివిధ రాష్ట్రాలు చేపట్టిన వివిధ అభివృద్ధి, ఉత్పాదక ప్రాజెక్టులపై ఈ రేట్ల ప్రభావాన్ని జీఎస్టీ మండలి సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఆయా ప్రాజెక్టులను అప్పటి పన్నురేట్లకు అనుగుణంగా చేపట్టారు. అలాగే సాంకేతిక సమస్యలతో నిలిచిపోయిన ఇ-వే బిల్లుల విధానానికి తాజాగా ఇటీవల దిల్లీ జీఎస్టీ సదస్సులో మార్గం సుగమం చేశారు. ముందు దూరంగా ఉండిపోయిన జమ్మూ-కశ్మీర్‌ను ఈ పన్ను పరిధిలోకి తేగలిగారు.

12 వందలకు పైగా వస్తువులు, అయిదువందల రకాల సేవలకు ఇతమిద్ధంగా పన్నురేట్లు ఖరారైనా శ్లాబులో వర్గీకరించడంలో నెలకొన్న గందరగోళాన్ని రానున్న కొద్ది నెలల్లో పరిష్కరించాలి. గతంలో సుబ్రహ్మణ్యన్ కమిటీ అన్ని రకాల వస్తువులు, సేవలపై ఏకరూప పన్ను 15 - 15.5% ఉండాలని ప్రతిపాదించింది.

పన్నురేట్లు హేతుబద్ధ స్థాయిలో ఉంటే, చెల్లింపులు స్వచ్ఛందంగా, నిజాయతీగా జరుగుతాయని 'ఆడంస్మిత్' ఏనాడో పేర్కొన్నారు. శ్లాబుల సంఖ్యను కనిష్ఠ స్థాయికి కుదించి, పన్నురేట్లను సహేతుకంగా స్థిరీకరించే దీర్ఘకాలిక లక్ష్యంతో ముందడుగు వేస్తే జీఎస్టీ ధ్యేయం నేరవేరినట్లే.

మాదిరి ప్రశ్నలు

1. వస్తు, సేవల పన్ను ఎప్పటినుంచి అమల్లోకి వచ్చింది?
1) 2017 జనవరి 1 2) 2017 మార్చి 1
3) 2017 ఏప్రిల్ 1 4) 2017 జులై 1

2. జీఎస్టీని 'గుడ్ అండ్ సింపుల్ టాక్స్'గా ఎవరు అభివర్ణించారు?
1) నరేంద్ర మోదీ 2) అరుణ్ జైట్లీ
3) ప్రణబ్ ముఖర్జీ 4) ఎం. వెంకయ్యనాయుడు

3. జీఎస్టీ మండలి (GST Council) కి నేతృత్వం వహించేదెవరు?
1) రాష్ట్రపతి 2) ప్రధానమంత్రి
3) కేంద్ర ఆర్థికమంత్రి 4) కేంద్ర పరిశ్రమల మంత్రి

4. జీఎస్టీని 1954 లో మొదటిసారిగా అమల్లోకి తెచ్చిన దేశం ఏది?
1) ఇంగ్లండ్ 2) ఫ్రాన్స్ 3) జర్మనీ 4) ఇటలీ

5. జీఎస్టీలో విధించే వివిధ రకాల పన్ను శ్లాబుల శాతం ఎంత?
1) 4, 11, 17, 27 2) 5, 12, 18, 28
3) 6, 13, 19, 29 4) 7, 14, 20, 30

6. ప్రస్తుతం మన దేశ జీడీపీ (GDP) లో పన్నుల వాటా ఎంత?
1) 14% 2) 15% 3) 16% 4) 17%

7. జీఎస్టీఎన్ (GSTN) మొదటి ఛైర్మన్ ఎవరు?
1) నవీన్ కుమార్ 2) ప్రకాష్ కుమార్
3) నితిన్ మిశ్రా 4) రాజీవ్ కుమార్

8. జీఎస్టీలో భాగంగా దేశంలో విధించే పన్ను రూపాలు ఏవి?
1) CGST 2) SGST 3) IGST 4) పైవన్నీ

9. జీఎస్టీల పరిధిలోకి వచ్చే వార్షిక వ్యాపారాదాయ పరిమితి ఎంత?
1) రూ. 10 లక్షలు 2) రూ. 15 లక్షలు
3) రూ. 20 లక్షలు 4) రూ. 25 లక్షలు

10. జీఎస్టీ కోసం రాజ్యాంగంలో సవరించిన ఆర్టికల్ ఏది?
1) 278 ఎ (1) 2) 299 ఎ (1)
3) 279 ఎ (1) 4) 280 ఎ (1)

11. జీఎస్టీ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రథమంగా రాటిఫై (Ratify) చేసిన రాష్ట్రం ఏది?
1) హరియాణా 2) అసోం
3) గుజరాత్ 4) పంజాబ్

12. 1 జులై 2017 న ఏ రాష్ట్రంలో జీఎస్టీ అమలు ప్రారంభం కాలేదు?
1) పశ్చిమ్ బంగ 2) ఒడిశా
3) జమ్మూ - కశ్మీర్ 4) పైవేవీకావు

జవాబులు

1-4	4-2	7-1	10-3
2-1	5-2	8-4	11-2
3-3	6-3	9-3	12-3

మీ అభిప్రాయాలు పంపాల్సిన మెయిల్ ఐడీ
pratibhadesk@eenadu.net

హాయ్! బుజ్జీ!!

చుకుచుకు కాదు... రయ్ రయ్!



కొత్త రైలు బళ్లు వస్తున్నాయ్... బుల్లెట్టుల్లా దూసుకెళ్లిపోతాయ్... తొందరగా గమ్యాన్ని చేర్చేస్తాయ్... వివరాలు చదివేయమంటున్నాయ్...

1 మొదటి స్థానం నాదే!

- చైనాలో ప్రపంచంలోనే వేగవంతమైన రైళ్లు త్వరలోనే పట్టాలెక్కుతున్నాయి. ఎప్పుడంటే వచ్చే సెప్టెంబరు 21 నుంచే.
- బీజింగ్ నుంచి షాంఘైల మధ్యే.
- వీటిని ఫక్సింగ్ రైళ్లని పిలిచేస్తున్నారు.
- వీటి ప్రత్యేకత ఏమంటే ఇప్పుడు ఉన్న వాటి కంటే వేగంగా గరిష్ఠంగా గంటకు 400 కిలోమీటర్లకుపైగా వేగాన్ని అందుకుంటాయి. అయితే ప్రమాదాలు జరగకుండా ఉండటానికి గంటకు 350 కిలోమీటర్ల వేగంతో పరుగులు తీసేలా ఏర్పాట్లుచేశారు.
- 1250 కిలోమీటర్ల దూరాన్ని నాలుగున్నర గంటల్లోనే చేరతాయి. అంటే హైదరాబాద్ నుంచి కాశీకి వెళ్లినంత దూరం మరి!

2 ఇప్పటికిదే రారాజు!

- ఇప్పుడు నడుస్తున్న రైళ్లలో ఎక్కువ వేగంగా ప్రయాణించే రైలు ఏదబ్బా అంటే హార్మొనీ సీఆర్‌హెచ్ 380ఏ.
- గరిష్ఠంగా ఇది గంటకు 379 కిలోమీటర్ల వేగంతో పరిగెట్టేస్తుంది.
- విద్యుత్‌శక్తితో పనిచేసే ఇది చైనాలోని షాంఘై, నాన్‌జింగ్‌ల మధ్య తిరుగుతోంది.
- ఒకేసారి 494 మందిని మోసుకుపోగలదు.
- ఈ దేశానికే చెందిన సీఎస్ఆర్ కింగ్‌డో సైఫో లోకోమోటివ్ అండ్ రోలింగ్ స్టాక్ సంస్థ దీన్ని తయారు చేసింది.

3 నాదిక మూడో స్థానం!

- ఇప్పుడు పట్టాలపై పరుగులు తీస్తున్న వాటిలో రెండో వేగవంతమైన రైలు ఏజీవీ ఇటాలో.
- గరిష్ఠంగా గంటకు 359 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది.
- ఇటలీలోని రోమ్, నేపల్స్ మధ్య రాకపోకలు సాగిస్తుంది.
- ఫ్రాన్స్ సంస్థ ఆల్‌స్టోమ్ దీన్ని తయారు చేసింది.
- మనకు కావలిసినట్టు మార్చుకునే సీట్లు, టీవీ, వైఫై లాంటి సౌకర్యాలూ దీనిలో ఉన్నాయి.

4 భారత్‌లో..

- మన దగ్గర ఇప్పటి వరకు బుల్లెట్ రైలే లేదు. మరి కొన్నేళ్లలో దీన్ని చూడొచ్చు. అలహాబాద్, ముంబయిల మధ్య ఈ లైను పనులు జరుగుతున్నాయి.
- అయితే ప్రస్తుతం మన దేశంలో అత్యంత వేగంగా ప్రయాణించే రైలు గతిమాన్ ఎక్స్‌ప్రెస్. ఇది సెమీ హైస్పీడ్ రైలు.
- మన రాజధాని దిల్లీ, ఆగ్రాల మధ్య తిరుగుతుందిది. అంటే 233 కిలోమీటర్ల దూరాన్ని 1:45 నిమిషాల్లో చేరుకుంటుంది.
- ఇది గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు.

మీకు తెలుసా?

- మొదటి బుల్లెట్ రైలు పుట్టింది జపాన్‌లో.
- 1930 నుంచీ దీనిపై ప్రయోగాలు మొదలయ్యాయి.
- ఇది 1964లో పట్టాలెక్కింది.

బుల్లెట్ రైలు తర్వాతేంటి?

- బుల్లెట్ రైలే వేగమనుకుంటే దాన్ని మించినది ఇంకోటీ వస్తోందండోయ్. అదే హైపర్‌లూప్.
- గంటకు 700కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుందిది. అంటే హైదరాబాద్ నుంచి విజయవాడకు దాదాపు 20 నిమిషాల్లోపే వెళ్లిపోవచ్చు.

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Put = పెట్టు
- కపటం = మోసం


> మన లోపల శత్రువు లేనంత వరకు బయటి శత్రువు మనల్ని భయపెట్టలేడు
>
> – గౌతమ బుద్ధుడు


చిలిపి ప్రశ్న


రోజూ వెండి గ్లాసుతో నీళ్లు తాగితే ఏమవుతుంది?

- జి. అన్నాజీరావు, పొందూరు

కవలలేరి?









నవ్వుల జల్లులు!

టీచర్: శీనూ! 'రంగస్థలం' అనే పదం ఇరవై సార్లు రాయమంటే పది సార్లే రాశావేం?

శీను: నేను లెక్కల్లో కూడా వీకే టీచర్!

- బి. రామారావు, నిజామాబాద్

కిరణ్: ఎందుకు అలా డల్‌గా ఉన్నావు?

రాము: కాలికి దెబ్బ తగిలింది హోమ్‌వర్క్ చేయలేదు...

కిరణ్: కాలికి దెబ్బ తగిలితే చేత్తో రాయడానికేం?

రాము: ఆ చేత్తోనే కదరా కాలికి మందు రాసేది!

- కె. గోవింద్, ఆముదాలవలస

సరదా పదాలు

ఇక్కడున్న తెలుగు పదాల సమానార్థకాల్ని పక్కనే ఉన్న ఆంగ్ల అక్షరం ఉచ్చారణ వచ్చేలా గడులు నింపగలరా?

1. బీజం V
2. గెలుపు V
3. ఖరీదు V
4. ఆశ్చర్యం V
5. పెళ్లి V
6. అమ్మకం V
7. నమ్మకం V
8. పద్ధతి V

- ఎం. అప్పాజీకృష్ణ, బెంగళూరు

గబగబా అనండి

పళ్లెంలో అక్షంతలు, కళ్లంలో పక్షులు

సుడోకు

			6					5
	2	5			9	6		
8					2			
4	9	6		2				
	1	7	5		4	9	6	
				6		1	4	7
			4					8
		2	8			7	9	
5					1			

ఈ సుడోకును 1 నుంచి 9 వరకు అంకెలతో నింపాలి. ప్రతి అడ్డు, నిలువు వరుసల్లోనూ, 3X3 చదరాల్లోనూ అన్ని అంకెలూ ఉండాలి. ఏదీ రెండుసార్లు రాకూడదు.

జవాబులు:

సరదా పదాలు: 1. విత్తనం 2. విజయం 3. విలువ 4. విచిత్రం 5. వివాహం 6. విక్రయం 7. విశ్వాసం 8. విధానం

కవలలేరి: ఖ,గ

చిలిపి ప్రశ్న: దాహం తీరుతుంది!

సుడోకు:

9	3	1	6	4	8	2	7	5
7	2	5	3	1	9	6	8	4
8	6	4	7	5	2	3	1	9
4	9	6	1	2	7	8	5	3
3	1	7	5	8	4	9	6	2
2	5	8	9	6	3	1	4	7
1	7	3	4	9	6	5	2	8
6	4	2	8	3	5	7	9	1
5	8	9	2	7	1	4	3	6

ఎందుకు? ఏమిటి? ఎలా?

గుడ్లగూబలు మెడల్ని ఎందుకలా తిప్పుతాయి?

ప్రశ్న: గుడ్లగూబ తన మెడను అంతలా వెనక్కి ఎందుకు తిప్పుతుంది?

- ఎం. నరేష్, 9వ తరగతి, నల్గొండ



జవాబు: గుడ్లగూబలు(owls) పగటిపూట సూర్యుని వెలుతురులో సరిగా చూడలేవు. అందువల్ల అవి రాత్రివేళల్లోనే తమ ఆహారాన్ని వేటాడుతాయి. రాత్రి వేళల్లో బాగా చూడ్డానికి అవసరమయ్యే కాంతిని రాబట్టుకోవడానికి వాటికి విశాలమైన కళ్లు వాటిలో గొట్టాల రూపంలో ఉండే కనుగుడ్లు ఉంటాయి. ఈ కనుగుడ్లు గొట్టాల రూపంలో ఉండటంతో అటూ ఇటూ కదిలించడం అంత సులభం కాదు. అందువల్ల గుడ్లగూబలు తమ తలల్ని వెనక్కి తిప్పుతాయి. వాటి మెడలో అదనంగా ఉండే ఎముకలు అలా తిప్పడానికి సాయపడతాయి. ఆ విధంగా గుడ్లగూబలు తనకు ఆహారంగా ఉండే జీవులకు ఏ మాత్రం తెలియకుండా తమ స్థానాల్లో కదలకుండానే తలల్ని 270 డిగ్రీల మేర తిప్పి వాటి ఉనికిని గుర్తించి వేటాడగలవు.

- ప్రొ॥ ఈ.వి.సుబ్బారావు, హైదరాబాద్

ఎక్కడి నుంచి వచ్చారో

బతుకు చాలించింది!

అల్వాల్, న్యూస్‌టుడే: ఓ అభాగ్యురాలు ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు. అడ్డకూలీగా పనిచేస్తూ తన ఇద్దరు పిల్లలను చదివించుకుంటూ హఠాత్తుగా మృతిచెందడంతో ఆ ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన స్థానికంగా విషాదం నింపింది. రెండు నెలల క్రితం లక్ష్మి (30)గా పరిచయం చేసుకొన్న ఆ మహిళ మచ్చబొల్లారం కుమ్మరి బస్తీలో అద్దె ఇల్లు తీసుకొని తన ఇద్దరు పిల్లలు రాణి, లోకేశ్‌లను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి, 1వ తరగతిలో చేర్పించింది. అప్పటి నుంచి కూలీ పని చేస్తూ కుటుంబాన్ని నడుపుతోంది. ఈక్రమంలో బుధవారం వేకువజామున నిద్రలోనే ఆమె మృతిచెందింది. తల్లికి ఏమైందో తెలియక ఆమె శవం పక్కన కూర్చుని పిల్లలు ఏడ్వడంతో ఘటన స్థానికుల ద్వారా వెలుగులోకి వచ్చింది. పోలీసులు శవానికి పంచనామా చేసి గాంధీ మార్చురీకి తరలించారు. అనారోగ్యంతో మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి పూర్తి వివరాలు తెలియకపోవడంతో పిల్లలను అనాథాశ్రమానికి పంపించారు. ఇంట్లో లభించిన ఆధార్ కార్డు ఆధారంగా భర్త బండారి జంగయ్యగా, నిజామాబాద్ నివాసిగా గుర్తించారు. ఈమేరకు పోలీసు బృందాన్ని నిజామాబాద్ పంపించారు. కేసు దర్యాప్తులో ఉంది.



లక్ష్మి

బీసీ సంక్షేమ శాఖ మంత్రికి సన్మానం

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: బీసీల సంక్షేమం కోసం మంత్రి కృషి చేయాలని కోరుతూ బుధవారం రాష్ట్ర బీసీ సంఘం ఆధ్వర్యంలో జోగు రామన్నను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా వైద్యుడు పుట్ట మల్లికార్జున్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా సాప శివరాం, ఉపాధ్యక్షుడిగా మఠం విజయ్‌కుమార్, ప్రధానకార్యదర్శిగా వనం గంగాధర్‌లను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. త్వరలో జిల్లాలో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసి పూర్తి స్థాయి కార్యవర్గాన్ని నియమిస్తామని తెలిపారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: **ఆరాధన:** వినాయకచవితి సందర్భంగా రేపటి స్పెషల్ ఆరాధనలో కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయ విశేషాలు; శ్రీ సామవేదం ప్రత్యేక ప్రవచనం 'శ్రీ గణేశ గీత' పూజ్యశ్రీ గణపతి సచ్చిదానందస్వామీజీ వినాయక చవితి దివ్యాశీస్సులు, 06-30: **అన్నదాత**, 07-00: **ఈటీవీ న్యూస్**, 07-30: **శుభమస్తు:** శిరిడిసాయికి హారతి సమర్పిస్తే ఎలాంటి ఫలితాలొస్తాయి; ఇల్లు నిర్మించే స్థలాన్ని శుద్ధి చేయడం ఎలా? (రేపటి స్పెషల్ శుభమస్తులో బ్రహ్మశ్రీ చాగంటి విశేష ప్రవచనం 'శ్రీ వినాయకవ్రతం'; అదృష్ట భాగ్యాన్నిచ్చే శ్రీ గణేశవాస్తు వివరాలు), 08-30: **టాలీవుడ్ టైమ్**, 09-00: **ఈనాడు సినిమా: తొలిచూపులోనే...** (కల్యాణ్‌రామ్, ఆకాంక్ష).

మధ్యాహ్నం

12-00: **అభి'రుచి':** ఘుమ ఘుమలు **'దొండకాయ పల్లీ ఇగురు'** మీచేతి వంట **'మిక్స్‌డ్ వెజ్ పికిల్', 'ఆలూ తోటకూర వేపుడు'**, జస్ట్ ఎ మినిట్ **'క్యాప్సికం ఫ్రిట్టర్స్'** తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: **స్టార్ మహిళ** (మెగా గేమ్ షో), 02-00: **అభిషేకం** (డైలీ సీరియల్), 02-30: **అత్తారింటికి దారేది** (డైలీ సీరియల్), 03-00: **సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2)** (డైలీ సీరియల్), 03-30: **ఆడదే ఆధారం** (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: **వసంతం** (డైలీ సీరియల్), 04-30: **జీన్స్–2** (రిపీట్), 05-30: **ఆడాళ్ళా మజాకా:** రావులపాలెంలో పరవళ్ళు తొక్కిన అతివల ఉత్సాహం, 06-00: **శ్రీ భాగవతం** (భక్తి రసాత్మక దృశ్య కావ్యం) (డైలీ సీరియల్), 06-30: **ఒకరికి ఒకరు** (డైలీ సీరియల్)

రాత్రి

07-00: **సావిత్రి** (డైలీ సీరియల్), 07-30: **మనసు మమత** (డైలీ సీరియల్), 08-00: **స్వాతిచినుకులు** (డైలీ సీరియల్), 08-30: **నా పేరు మీనాక్షి** (డైలీ సీరియల్), 09-00: **ఈటీవీ న్యూస్**, 09-30: **జబర్దస్త్:** కడుపుబ్బ నవ్వించే కామెడీ షో...), 10-30: **జబర్దస్త్ జల్సాటైం...**

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం 12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 ఆనందోబ్రహ్మ రిపీట్
01:15 డిజె రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 ఈ-జంక్షన్ రిపీట్
సాయంత్రం 04:30 ఎక్స్‌ప్రెస్ రాజా
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 పోవే..పోరా
09:00 పటాస్
09:30 మైకేల్ మదన్ కామరాజు
09:45 ది బ్రేకప్ కన్సల్టంట్
10:00 ఆనందోబ్రహ్మ
10:15 డిజె
10:30 తారక్ మామా అయ్యోరామ రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

★ మానస (ఉ. 6:00, సా. 6.00, రా. 11.00)
★ **డా. ఈటీవి** (ఉ. 6:30, 11:00, మ. 3:30. రా. 7:30)
★ యోగమంత్ర (ఉ. 7:00, సా.5:30, రా. 11:30)
★ **గెట్‌సెట్‌ఫిట్** (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)
★ **అమృతం** (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)
★ **హెల్దీ & టేస్టీ** – (ఉ. 8:30, మ. 01:00, రా. 8:30)
★ **ఆరోగ్యమస్తు** (ఉ. 09:00, 10:30, మ. 3:00, రా. 09:00)
★ **జీవనరేఖ చైల్డ్ కేర్** - (ఉ. 09:30, మ. 2:00, సా. 04:00, రా. 7:00)
★ **బాడీ మైండ్ & సోల్ - సుఖ జీవనం** (ఉ. 10:00, మ. 2:30, రా. 9:30).
★ **విహారి** (మ. 12:00, సా. 6:30, రా. 10:00)
★ **హెల్దీ డయాబెటిక్** (మ. 1:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: **సన్‌రైజ్ సినిమా: కాబోయే అల్లుడు** (రాజేంద్రప్రసాద్, కల్పన), 10-00: **మార్నింగ్ షో: హంతకులొస్తున్నారు జాగ్రత్త!** (రామకృష్ణ అంజలి), **మధ్యాహ్నం:** 1-00: **మాట్నీ: ఆడుతూ పాడుతూ...** (శ్రీకాంత్, సునీల్), **సాయంత్రం:** 4-00: **ఈవినింగ్ షో: జీవితమే ఒక సినిమా** (వరుణ్‌రాజ్, గీతాంజలి), **రాత్రి:** 7-00: **ఫస్ట్ షో: రామరాజ్యం** (జగ్గయ్య, సావిత్రి), 10-00: యువ దర్శకుడు హను రాఘవపూడితో గుర్తుకొస్తున్నాయి...

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - ఎగ్ క్రేప్స్ & తెలగపిండి రవ్వ బాత్, **ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో –** అవకాడో క్రేప్స్ & తెలగపిండి మిక్స్‌డ్ వెజిటబుల్ ఊతప్పం, **ఉ.10.00: పిండివంటలు,** ప్రసాదాలు **–** అటుకుల బర్ఫీ & కరివేపాకు అన్నం, **ఉ.11.00, రా.10.45: గోరు ముద్దలు –** పన్నీర్ మఖనీ రైస్, **ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ** (వృద్ధ వయసు వారికోసం) **–** ఫిష్ కర్రీ విత్‌అవుట్ ఆయిల్, **ఉ.11.30, రా.8:00: గాయత్రీ గోల్డ్ "బాబాయ్ హోటల్"** - అక్కి రోటీ & రాజంకి చట్నీ, **మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా** - మూరీ ఘూంటో (బెంగాలీ క్యూసైన్), **మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ –** బెల్లం రవ్వ హల్వా, **మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్** - కేరళ స్టైల్ చికెన్ కర్రీ, **మ.12.45: సూప్స్ & స్టార్టర్స్** - షెజ్వాన్ బ్రొకోలీ పీనట్ టిక్కీ, **మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి (జపాన్ స్పెషల్) –** జపనీస్ ఫిష్ సూప్ అండ్ ప్రాన్స్ & ఫిష్ క్యాబేజి, **మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్)** - బచ్చలికూర అవపెట్టిన కూర పులుసు, **మ.1.45, రా.7.30: పెరటి రుచులు, మ.2.15, రా.10.30: డిజైనర్ డిష్ –** పన్నీర్ టమాటో మసాలా, **మ.2.30: చోటా షెఫ్ –** పొటాటో క్యాబేజి బాల్స్, **మ.3.30: భళా మిస్టర్ బ్రహ్మచారి –** స్వీట్‌కార్న్ మష్రూమ్ సూప్, **మ.5.15: స్నాక్స్** - బ్రెడ్ దహీ వడ.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360^{0}, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360^{0}, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: మధుమేహం... ఆధునిక చికిత్సలు, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, కొమ్ముచిక్కల, పశ్చిమగోదావరి జిల్లా, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం,07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360^{0}, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360^{0}, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360^{0}, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ విజయ గణపతి ఆలయం, ఖమ్మం, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: మధుమేహం... ఆధునిక చికిత్సలు, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి (రిపీట్), 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360^{0}, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 24-08-2017

SVBC (TTD) — **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణుసహస్ర నామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తిరుప్పావడ సేవ), 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయె - దత్తాత్రేయుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగళు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్త మాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, లైవ్‌డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం (రిపీట్), **సాయంత్రం:** 04-30 వినాయక పూజావిధానం, 05-00 లైవ్ ఎస్.డి. సేవ + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 పత్రిపూజ - ఆరోగ్యం, 08-00 నేను - నాస్వామి, 08-30 ధర్మసోపానాలు - చాగంటి, 09-00 జ్యోతి గణేష్ ఆలయం, 09-30 దేవీ సప్తశతి - సామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 వినాయక వైభవం.

భక్తి TV — **ఉదయం:** 06-00 సాయి హారతి, 06-30 సద్గురు స్తోత్రం, 7-00 అర్చన, 7-30 సాయిగీతామృతం, 08-00 పుణ్యక్షేత్రం, 08-30 గణపతి వైభవం, 09-00 శ్రీగణేశాయ నమః, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 గణపతి కటాక్షం, 05-30 శ్రీగణేశ సహస్రం, 06-00 శ్రీగణేశస్తోత్రం, 06-30 ఖైరతాబాద్ గణేష్ దర్శనం (లైవ్) **రాత్రి:** 07-00 జయ గణనాయక.. వినాయక (లైవ్), 08-00 వినాయకాయ విద్మహే, 08-30 గణపతి క్షేత్ర వైభవం, 09-00 శ్రీగణేశాయ నమః, 09-30 వినాయక వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 శ్రీగణేశస్తోత్రం.

జీ తెలుగు — **ఉదయం:** 07-30 శుభమస్తు, 08-00 సినిమా: దమ్ము, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్ రష్, 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్దమందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాలముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: భీమవరం బుల్లోడు.

మా — **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు - దిన ఫలం, 08-30 శ్రీవినాయక చరితం, 09-00 సినిమా: డాన్, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 కుంకుమపువ్వు, 01-30 బిగ్ బాస్ రిపీట్, 03-00 సినిమా: షిరిడి సాయి, **సాయంత్రం:** 05-30 ఒకే జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్ బాస్, 10-30 బిగ్ బాస్ రిపీట్.

జెమిని — **ఉదయం:** 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా:బంగారం , **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్), 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: గుండెఝల్లుమంది, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని-2, 08-00 నువ్వు నాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు, 10-00 సినిమా: **గోలీమార్.**

అన్నదాతలో... రేపు ఉదయం 6.30 గం.లకు
1. హరిత పందిళ్లలో చామంతుల విరులు - సిరులందుకుంటున్న రైతు
2. చేపల చెరువుల్లో ఎరువుల యాజమాన్యం
3. అంటు మొక్కల ఎంపిక, నాటడంలో మెలకువలు
ఉచిత హెల్ప్‌లైన్ నెం.1800-425-4085కు ఉ.10-11 గం.ల మధ్య ఫోన్ చేయవచ్చు.

రైతేరాజు

జైకిసాన్‌లో... ఈటీవీ తెలంగాణ — నేటి సాయంత్రం 6.30 గంటలకు
1. మిశ్రమ సేద్యంలో నిర్మల్ రైతులు లాభాలకు మార్గమంటున్న సాగుదారులు
2. రాజధానిలో విస్తరిస్తోన్న ఇంటి పంట పైకప్పు సేద్యం లాభదాయకమంటున్న రైతులు
జైకిసాన్ కార్యక్రమాన్ని www.youtube.com/etv2jaikisan ద్వారా కూడా వీక్షించవచ్చు.

గొర్రెల్లో కాలిపుండు వ్యాధి



ప్రస్తుతం నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ఈ అంటువ్యాధి అత్యంత వేగంగా వ్యాప్తి చెందుతోంది. కాలిపుండు వ్యాధి గొర్రెల పెంపకందార్లకు తీరని ఆర్థిక నష్టాన్ని కలుగ చేస్తుందని సదాశివనగర్ మండల పశువైద్యాధికారిణి గీతమాలిక తెలిపారు.

వర్షాకాలంలో వర్షాలు ఎక్కువగా కురిసి, నేలలు చిత్తడిగా తయారై, ఆ నేలల మీద మందలు తిరిగినప్పుడు ఈ వ్యాధి ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉంటుందన్నారు. పచ్చిక బయళ్లలో మురుగునీటి సౌకర్యం సరిగా లేక నీరు నిలిచినప్పుడు, ఈ వ్యాధి వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. గిట్టలు వంకర తిరిగి ఉన్నప్పుడు ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. వ్యాధి సోకిన గొర్రెల ద్వారా వ్యాధి ఇతర గొర్రెలకు వ్యాప్తి చెందుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉండి, గిట్టలకు దెబ్బలు తాకినప్పుడు వ్యాధి త్వరగా వ్యాప్తి చెందుతుంది.

వ్యాధి లక్షణాలు: ★ ముందుగా మందలోని కొన్ని గొర్రెలు ఒకటి లేదా రెండు కాళ్లు కుంటుతూ నడుస్తాయి.
★ గొర్రెల గిట్టల మధ్యభాగం ఎర్రగా కందుతుంది.
★ వ్యాధి సోకిన గొర్రె ముడికాళ్ల మీద గెంతుతుంది.
★ గొర్రెలు మేత సరిగా మేయవు. బరువు తగ్గుతాయి.
★ ఎర్రగా కందిన భాగం ఉబ్బి, చీము పట్టి నల్లగా కమిలిపోతుంది.
★ ఈ భాగంపై తొడుగు ఏర్పడి, అదే క్రమేణా ఊడిపోయి, చెడువాసన వస్తుంది.
★ వ్యాధి తీవ్రంగా ఉంటే గిట్టలు కూడా ఊడిపోయే ప్రమాదం ఉంది.

చికిత్స: ★ వంకరగా తిరిగి ఉన్న గిట్టలను హూఫ్‌కట్టర్ తో గాని స్కాల్‌పేల్‌తో గాని ట్రిమ్మింగ్ చేయాలి. ట్రిమ్మింగ్ చేసే ముందు పరికరాలను యాంటీసెప్టిక్ ద్రావణంతో శుభ్రపరచాలి.
★ వ్యాధి సోకిన గిట్టలను 8 శాతం మైలుతుత్తం ద్రావణంలో గాని 10 శాతం జింకు సల్ఫేట్ ద్రావణంలో గాని 5 శాతం ఫార్మలిన్ ద్రావణంలో రోజుకు రెండుసార్లు కడిగి ఫురోసిన్ లేదా నెబాసల్ఫ్ ఆయింటుమెంట్ రాయాలి.
★ బాగా చెడిపోయిన గిట్టలను 5 శాతం ఫార్మాలిన్ ద్రావణంలో గానీ గంట సేపు ఉంచితే వ్యాధి త్వరగా నయమవుతుంది.
★ వైద్యం చేయించే గొర్రెలను మందతో పాటు పంపకుండా, సిమెంటు కాంక్రీటు నేల మీద కనీసం రెండు గంటల పాటు ఉంచి తదుపరి శుభ్రమైన పచ్చిక బయళ్లల్లో మేపాలి.
★ పశువైద్యుని సలహా మేరకు పెన్సిలిన్ వంటి యాంటి బయోటిక్ మందులు వాడాలి.

నివారణ చర్యలు ★ వ్యాధి సోకిన గొర్రెలను మంద నుంచి వేరు చేసి, ఆరోగ్యవంతమైన గొర్రెలకు ఈ వ్యాధి సంక్రమించకుండా జాగ్రత్తపడాలి.
★ మందను చిత్తడి నేలలో, నీరు నిలిచే ప్రదేశాలలో నిలుపకుండా ఎత్తయిన పొడి ప్రదేశాలలో నిలపాలి.
★ వ్యాధి సోకిన గొర్రెలు మేసిన ప్రదేశాలలో ఆరోగ్యవంతమైన మందను మేపకూడదు.
★ వర్షాకాలంలో మందను 10 శాతం జింకుసల్ఫేట్ లేదా 4-8 శాతం కాపర్‌సల్ఫేట్ లేదా 5 శాతం ఫార్మాలిన్ ద్రావణం కలిగిన ఫుట్‌బాత్‌ల ద్వారా నడిపించాలి.
★ గొర్రెల కాపరి వ్యాధిగ్రస్తమైన గొర్రెలకు డ్రెస్సింగ్ చేసిన తదుపరి పరికరాలను, చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. ఇతర గొర్రెలకు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తపడాలి.

– న్యూస్‌టుడే, సదాశివనగర్ (కామారెడ్డి జిల్లా)

మొక్కజొన్నలో కాండంతొలిచే పురుగు

కాండంతొలిచే పురుగుల వల్ల మొక్కజొన్నకు 40-50 శాతం పంటనష్టం వాటిల్లుతుంది. మొక్క మొలకెత్తిన 10-40 రోజులు వరకు ఈ పురుగు ఆశిస్తుంది. దీని తల్లి రెక్కల పురుగులు పంట లేని కాలంలో కలుపు మొక్కలు మీద, పొలం గట్ల మీద గుడ్లు పెడతాయి. ఇవి 5-6 రోజుల్లో పొదిగి పిల్ల లార్వాలు బయటకు వస్తాయి. ఈ పిల్ల పురుగులు మొదట ఆకులపై పత్రపరితాన్ని గోకి తింటాయి. తరువాత ఆకు ద్వారా కాండం లోపలికి చేరుకుంటాయి. కాండం లోపల పదార్థాన్ని కూడా గోకి తినడం వల్ల ఆకులు విచ్చుకున్నప్పుడు పొడవాటి చిల్లులు వరుస క్రమంలో కనిపిస్తాయి. లార్వాలు ఎదుగుతున్న కొద్ది లోపల అంకురం తినడం వల్ల మొవ్వు ఎండిపోతుంది. మొవ్వు చేత్తో పీకితే సులువుగా ఊడి వస్తుంది. దీనిని 'డెడ్‌హార్ట్' అంటారు. కాండం లోపల చూస్తే గుండ్రని లేదా 'ఎస్' ఆకారపు సొరంగాలు ఏర్పడుతాయి. మొక్కలు చనిపోయి పంటకు తీవ్రనష్టం వాటిల్లుతుంది.

చేపట్టాల్సిన సస్యరక్షణ: ★ పంట కాలంలో కలుపు మొక్కలు చెత్త-చెదారం లేకుండా శుభ్రంగా ఉంచాలి.
★ పురుగు ఆశించిన మొక్కలను పీకి నాశనం చేయాలి.
★ కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరాకు 3 కిలోల చొప్పున పైరు మొలకెత్తిన 25-30 రోజులకు ఆకు సుడుల్లో వేయాలి.
★ పురుగును సమర్థవంతంగా నివారించగలుగుతాం.
★ పైరు మొలకెత్తిన 10-12 రోజులకు మోనోక్రోటోఫాస్ 320 మి.లీ., 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేస్తే పురుగును సమర్థవంతంగా నివారించవచ్చు.

కాళేశ్వరం మా కలల ప్రాజెక్టు

సబ్బండ వర్ణాల మద్దతు

రెండు పంటలు పండుతాయి



కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ పనులు పూర్తయితే కామారెడ్డి జిల్లా సస్యశ్యామలమవుతుంది. రెండు పంటలు పండుతాయి. గత కొన్నేళ్లుగా సాగునీటి కోసం కళ్లల్లో ఒత్తులు వేసుకొని చూస్తున్నాం. ఈ ప్రాజెక్టుతో రైతుల బతుకులు బాగుపడతాయి. ఎల్లారెడ్డి ఎత్తైన ప్రాంతం. ఇక్కడ చుక్క వర్షపు నీరు నిలవదు. రైతు బిడ్డ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ప్రాంత సమస్యలపై పూర్తి అవగాహనతో ఉండడంతో ఈ ప్యాకేజీ పనులకు శ్రీకారం చుట్టారు. దీంతో పర్యావరణానికి ఎటువంటి హానీ కలుగదు. దీంతో అటవీ విస్తీర్ణం పెరుగుతుంది. గుట్టల ప్రాంతం కావడంతో తాగునీటికి సైతం ఇబ్బందులు పడుతున్నాం. రాజకీయాలకతీతంగా చేపడుతున్న బృహత్తర ప్రాజెక్టుకు అందరూ మద్దతు ప్రకటించాలి. **- ఏనుగు రవీందర్‌రెడ్డి, ఎమ్మెల్యే,ఎల్లారెడ్డి.**

వలసలు నివారించవచ్చు



సాగునీటి సౌకర్యం లేక సరైన పంటలు పండక ఈ ప్రాంత ప్రజలు దేశ, విదేశాలకు వలస వెళ్తున్నారు. స్వాతంత్ర్యం సిద్ధించిన నుంచి ఈ ప్రాంతానికి సాగునీరందించేందుకు ఏ ముఖ్యమంత్రి ఆలోచన చేయలేదు. అది కేసీఆర్ చేశారు. మల్లన్న సాగర్ నుంచి లిఫ్టుల ద్వారా నిజాంసాగర్‌లో సాగునీటిని తరలించడంతో ఈ ప్రాంతంలో రెండు పంటలు పండుతాయి. వలసలను నివారించవచ్చు. మా నియోజకవర్గంలోని నిజాంసాగర్ మండలంతో పాటు పిట్లం, జుక్కల్ మండలాల్లో 40 వేల ఎకరాలకు సాగునీరందించేందుకు ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రిని కోరుతాను. **- హన్మంత్‌షిండే, ఎమ్మెల్యే, జుక్కల్**

కామారెడ్డి: సాగునీటి ప్రాజెక్టులేని ఈ జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు చేపడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తమ బీడు భూములు తడుస్తాయని ఆశతో ఎన్నో ఏళ్లు ఎదురు చూస్తున్నామని, కళ నెరవేరుతున్న వేళ తామంతా సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని పలువురు రైతులు పేర్కొన్నారు. జిల్లాలో బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు తలపెట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు తమ కలల ప్రాజెక్టు అని రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. సాగునీటి కోసం పంట పొలాల్లో పదుల సంఖ్యలో బోర్లు వేసి నష్టపోయామని ఆవేదనను వెలిబుచ్చారు. సాధ్యమైనంత త్వరగా ప్రాజెక్టును పూర్తిచేసి సాగు, తాగునీరందించాలని కోరారు. ప్రస్తుతం చేపడుతున్న ప్యాకేజీలో కొన్ని గ్రామాలకు సాగునీరందని పరిస్థితి ఉందని, ఇంజినీరింగ్ అధికారులు మరోసారి రీసర్వే చేసి అన్ని గ్రామాలకు సాగునీరందేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. తాము కోల్పోతున్న భూమికి బదులు భూమి, ఇళ్లకు బదులు ఇళ్లు, కూలీలకు జీవనభృతి కల్పిస్తే తమ భూములను ఇచ్చేందుకు అంగీకరిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో చేపడుతున్న రిజర్వాయర్ల నిర్మాణంలో ఎక్కువగా గిరిజనులే భూములే పోతున్నాయని, తగిన న్యాయం చేయాలని పలువురు గిరిజన సంఘాల ప్రతినిధులు అధికారులను కోరారు. తెరాస నాయకులతో పాటు కాంగ్రెస్ , సీపీఐ, సీపీఎం నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సంపూర్ణ మద్దతు తెలిపారు. కానీ, 2013 చట్టం ప్రకారమే పరిహారం అందించాలని కోరారు.

బుధవారం జిల్లాకేంద్రం దేవునిపల్లి శివారులోని లక్ష్మీకల్యాణ మండపంలో జిల్లాపాలనాధికారి సత్యనారాయణ అధ్యక్షతన కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ప్రజల నుంచి అభిప్రాయాలను స్వీకరించారు. దీనికి ఎమ్మెల్యేలు ఏనుగు రవీందర్‌రెడ్డి, హన్మంత్ షిండే, జడ్పీ ఛైర్మన్ దఫేదార్ రాజు, డీసీఎంఎస్ ఛైర్మన్ ముజీబొద్దీన్, డీసీసీబీ ఉపాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు సంపత్‌గౌడ్‌లతో పాటు ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రాథమిక సహకార సంఘాల అధ్యక్షులు, ఆయా వర్గాల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రైతులు, వామపక్షాల ప్రతినిధులు, వృత్తిదారుల సంఘాల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన సూచనలు, అభిప్రాయాలను కేంద్ర పర్యావరణ మండలికి నివేదిస్తామని పాలనాధికారి సత్యనారాయణ స్పష్టం చేశారు. కేంద్ర పర్యావరణ శాఖ సూచనలకు అనుగుణంగానే ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహించామని పేర్కొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

- చంద్రశేఖర్, సీపీఎం జిల్లా కార్యదర్శి



భూములు కోల్పోతున్న నిర్వాసితులకు 2013 చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలి. బీడు భూములను సస్యశ్యామలం చేసే ప్రాజెక్టులను వామపక్షాలు వ్యతిరేకించవు. అన్ని వర్గాలకు సమన్యాయంగా ఉండేలా నిర్మాణం జరగాలి. సాగునీటి కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతుల కళ నెరవేరుతుందంటే ఎవరూ వ్యతిరేకించరు.

రైతులకు అవగాహన కల్పించాలి

- పద్మ, వామపక్ష నాయకురాలు



ప్రాజెక్టులో భాగంగా చేపడుతున్న బ్యారేజీల నిర్మాణంపై క్షేత్రస్థాయిలో రైతులకు పూర్తి అవగాహన కల్పించాలి. ప్రభుత్వం ప్రాజెక్టు నివేదికను తెలుగులో ప్రజలకు అర్థమయ్యేలా అందించేందుకు చర్యలు చేపట్టాలి. ప్రజలను చైతన్యం చేసిన తర్వాతే ప్రజాభిప్రాయ సేకరణ చేయాలి. జిల్లా కేంద్రంలోనే కాకుండా గ్రామగ్రామాన సమావేశాలు నిర్వహించాలి.

కాంగ్రెస్ వ్యతిరేకించదు

- జమునారాథోడ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు



భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలి. రైతులకు మేలు జరిగే ప్రాజెక్టులకు కాంగ్రెస్ ఎప్పుడూ వ్యతిరేకించదు. అయితే భూములను కోల్పోతున్న రైతులకు సమ్మతమైన పరిహారం అందించాలి. వారికి అన్ని రకాల వసతులు కల్పించాలి. కుల వృత్తుల వారితో పాటు, వ్యవసాయ కూలీలకు సైతం తగిన పరిహారం ఇవ్వాలి.

నీళ్లు లేక 'సాగర్' ఎడారి

- దఫేదర్ రాజు, జిల్లా పరిషత్ ఛైర్మన్



నిజాంసాగర్ జలాశయం నీళ్లు లేక ఎడారిగా మారింది. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయితే మల్లన్నసాగర్ నుంచి నీటిని తరలించడంతో నిజాంసాగర్ నిండుతుంది. దీంతో ఈ ప్రాంతంలో రెండు పంటలకు సమృద్ధిగా నీరందుతుంది. ఈ ప్యాకేజీ పనులతో భూములు కోల్పోతున్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుంది.

స్వరాష్ట్రంలో సాగునీటికి కరవుండదు

- ముజీబోద్దిన్, డీసీఎంఎస్ ఛైర్మన్



నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఉద్యమం జరిగింది. ప్రస్తుతం నీళ్ల కోసమే భారీ ప్రాజెక్టులు చేపడుతున్నారు. కాళేశ్వరం నీరందితే సాగునీటికి, తాగునీటికి కొరత ఉండదు. వేసవిలో జిల్లా కేంద్రంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన ఈ ప్రాజెక్టు పర్యావరణ అనుమతుల కోసం కేవలం ఒక ఆంధ్ర ప్రాంతంలోనే ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. దీంతో మహారాష్ట్ర నిర్మాణాన్ని అడ్డుకుంది. ప్రస్తుతం మహారాష్ట్రలో సైతం ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతోంది.





హాజరైన ప్రజాప్రతినిధులు : సమావేశంలో మాట్లాడుతున్న పాలనాధికారి

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

ధర్మారావుపేట (సదాశివనగర్), న్యూస్‌టుడే: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు సదాశివనగర్ మండలం ధర్మారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు అశోక్, ప్రధానోపాధ్యాయుడు శ్రీకర్‌రావు తెలిపారు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని మొదటి స్థానంలో నిలిచిన గాండ్ల నవీన్, కుమ్మరి భాస్కర్ జాతీయ స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 25 నుంచి 27 వరకు చెన్నైలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులకు వీడీసీ, పాలకేంద్రం ప్రతినిధులు, సర్పంచి వాణిబాయి, ఎంపీటీసీ సభ్యుడు మల్లేశ్‌యాదవ్ ఆర్థిక సాయం అందించారు. తమ గ్రామఖ్యాతిని జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చినందున ఇద్దరు క్రీడాకారులను వారు అభినందించారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

కామారెడ్డి, న్యూస్‌టుడే: ఇటీవల కోదండరాం స్ఫూర్తియాత్ర అడ్డగింతలో భాగంగా ఐకాస ప్రతినిధి, న్యాయవాది వీఎల్ నర్సింహ్మారెడ్డిపై తెరాస నాయకుల దాడికి నిరసనగా బుధవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. తెరాస నాయకుల దాడి సరైంది కాదన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘం అధ్యక్షుడు రత్నాకర్, ఉపాధ్యక్షుడు చింతల గోపి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుకు శ్రీకారం

కామారెడ్డి సాంస్కృతికం, న్యూస్‌టుడే : తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం (టీజేఎస్ఎఫ్) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు పసుల చరణ్, కామారెడ్డి జిల్లా జాగృతి కన్వీనర్ అనంతరాములు ప్రారంభించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు కళాశాలల విద్యార్థులకు సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రోషయ్య, జిల్లా కో -కన్వీనర్ కపిల్‌రెడ్డి, చక్రధర్, సంతోష్‌రెడ్డి, పద్మజ, బాలాజీ , రవి తదితరులు పాల్గొన్నారు.

